

# గ్రామ్య వాసనం

వి. యస్. సుక్థాంకర్

మంగేష్‌రావు తెల్లవారుతూండగా బయలుదేరాడు. రెండుగంటలుగా నడుస్తూనే ఉన్నాడు ఈ కొండ పైకి చేరటానికి అర గంట పట్టింది.

సూర్యుడు నడినెత్తి కెక్కటానికి ఇంకా చాలా వ్యవధి ఉంది; కాని ఎండ తీక్షణం మాత్రం తక్కువగాలేదు మంగేష్‌రావు వళ్లంతా చెమటతో తడిసిపోయింది. విశ్రాంతికోసం ఒక జీడిమామిడిచెట్టు కిందకిచేరి, అక్కడే కూర్చున్నాడు. రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు, విసురుకున్నాడు.

అతని ముందు పరుచుకుని ఉన్న కొండ చరియ వసంతకాలపు శోభతో పచ్చగా, మెత్తగా కనిపిస్తోంది. ఎటు చూసినా జీడి మామిడి చెట్లు — వాటి పళ్లు పొద్దు ఎండలో ఎర్రగా, పసుప్పచ్చగా మెరుస్తున్నాయి.

దుబ్బుగా ఎదిగిన పొద వెనుక తోపులో ఎత్తుగా ఎదిగిన కొబ్బరి, పోకచెట్ల వరుసలు—వాటి వెనకాల చిన్న లోయలోని ఊరు ఇంచుమించు కనుమరుగయిపోయి ఉంది. మంగేష్‌రావు కూర్చున్నచోటునుంచి దేవాలయం విమానం, ధ్వజస్తంభం, ఇవి రెండు మాత్రమే స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ రెండూ ఎన్నియుగాలగానో, ద్వారపాలకులలాగ నిటారుగా నుంచుని, బాటసారులకి ఊరి పరిసరాలని తెలుపుతూ వచ్చాయి. 'అమ్మయ్య! ఇక దగ్గరకొచ్చేసింది...' అనుకున్నాడు మంగేష్‌రావు.

ఆయాసం తీరిన తర్వాత ఉషారుగా లేచి నుంచున్నాడు. గొడుగుతో ఒక కొమ్మని కిందికివంచి పళ్లుకోసుకున్నాడు. వాటి రసం చప్పరిస్తూ ఊరివయిపుగా లోయలోకి దిగి నడిచి వెళ్లిపోయాడు.

పావుగంటలో కొండ చరియ చాలా మట్టుకు దిగివేశాడు; హటాత్తుగా చెట్ల మధ్యనుంచి ఒక పెద్ద సరస్సు కనిపించింది. సరస్సుచుట్టూ పూరికప్పులువేసిన మట్టి గోడల గుడిసెలు ఉన్నాయి.

అక్కడక్కడ పచ్చటి కొబ్బరితోపులు, పళ్లతోటలు; సరస్సుకి ఉత్తరంగా కలిసే చిన్న కొండవాగు; దక్షిణం వయపున ఉధృతంగా పొంగిన సముద్ర వంకాన్ని అరికట్టే చిన్నకట్ట — ఈ దృశ్యాన్ని చూస్తూ నుంచుని ఉండిపోయిన మంగేష్‌రావ్‌ని ఎవరో 'ఏ ఊరు బాబూ, మీది?' అని అడగటంతో కొంచెం ఉలిక్కిపడ్డాడు. బాగా రయితు

యాసలో తన్ను ఇలా పలకరించింది ఎవరా, అని చుట్టూ కలయ చూశాడు. ఎవరూ కనిపించలేదు.

'మా ఊరికేసి చూస్తున్నారేంటి బాబూ? అయిదేళ్లయింది ఇలా ఎండిపోయి!'

మంగేష్‌రావ్ తన ఎడంవైపుగా పైకి చూశాడు. కంఠస్వరం పైనుంచి వచ్చినట్లు ఉంది. పెద్ద మర్రిచెట్టు కొమ్మలమధ్య వయస్సుమళ్ళిన రయితు ఒకతను కూర్చుని ఉన్నాడు. చెట్టు నెరసి పోయి ఉంది. అప్పుడప్పుడు చిన్న కొమ్మలు తుంచి కిందనే మందంగా మేస్తున్న ఒక బక్కఆవుకి వేస్తున్నాడు. తనని పలకరించిన మనిషి ఇతనే అయి ఉంటాడను కున్నాడు మంగేష్‌రావ్.

అతని ప్రశ్న మంగేష్‌రావ్‌కి విచిత్రంగా తోచింది. బహుశ, ఈ ముసలివాడి మతి స్థిమితంగా లేదేమో అనుకున్నాడు అయినా మర్యాదకోసం, 'బలే చిక్కు ప్రశ్న వేశారే! మీ ఊరేమిటి ఎండిపోవటమేమిటి? చూస్తుంటేనే ఆకలిదప్పులు తీరేట్లుంది! ఇక ఈ చెరువు - ఎంత అందంగా ఉంది!' అన్నాడు.

ముసలి రయితుకి కోపం వచ్చినట్లుంది. 'అన్నన్నను, అంగంగా ఉందా మీకు? ఏంటేంటి, చూస్తేనే ఆకలిదప్పులు తీరిపొయ్యేయా? బాబూ, ఈ అందమయిన సెరువు మూలకంగానే మేము మాడి సస్తున్నాం! మా పొట్లు సూసి సంతోసించే వారి కల్లు పాపపు కల్లు...! సంతోసమా?! పుండు మీద కారం సల్లినట్లుంది ... బగమంతుడు మీ పరాసికాలని సమించాలి! ఆహాహా సెరువందంగా ఉందీ...' మాట్లాడుతున్న కొద్దీ వృద్ధుడి కోపం అధికం కాజొచ్చింది. బొమలు ముడిచాడు, మెడ వణికింది.

సాధారణంగా శాంతంగా ఉండే మంగేష్‌రావు ముఖకవళికలు అతని ధోరణికి అతి వేగంగా మారిపోయాయి. కాని కొద్ది సేపటిలో తేరుకున్నాడు.

'ఏమిటయ్యా అంతకోపం వచ్చింది మీకు? నేనే మన్నానని! రిపబ్లిక్ సంవత్సరంలో బొంబాయి వెళ్లిపోయాను—అది 1910 మాట! గోవాకి మళ్ళీ పదిహేనేళ్ల తర్వాత తిరిగి వస్తున్నాను...' అని కొన్ని క్షణాలు ఆగి తిరిగి ఇలా చెప్పుకుంటూ పోయాడు! 'అసలు మీ ఊరికి రావటం నాకిదే మొదటిసారి! మీ బాధలు నాకేమి తెలుస్తాయి చెప్పండి? తెలీక మీకు కష్టం కలిగిస్తే మాత్రం మన్నించాలి ... బుద్ధిపూర్వకంగా ఏమీ అనలేదు!'

మంగేష్‌రావ్ మాటలు వినగానే ముసలి రయితు కోపం బాగా తగ్గిపోయింది. దారికి వచ్చే ధోరణిలో, 'అట్లాగా బాబూ? మా ఊరిని గురించి మీకేం తెలీదా? చమించండి! మాకు మా బూముల సంగతి తప్పితే వేరే ఏవీ తెలీవుగదా ... చాలా కష్టాల్లో ఉన్నాం! తప్పయితే మన్నించండి!' అన్నాడు.

చెట్టుదిగి వచ్చేసి మంగేష్‌రావ్ ఎదురుగా నుంచున్నాడు. ఇంకా ఇలా చెప్పుకుపోయాడు దీనంగా—

'నా కెనబయ్యేళ్లు నిండాయంటారు. ఏమో, అయిదిటో అటో ఉండాయేమో ఎవరికి తెలుసూ? కాని బాబూ! నా బతుకులో ఇంత చెడ్డరోజులు చూడలేదంటే నమ్మండి—నలబయ్యేళ్లకింద మిడతలదండు పడ్డప్పుడు తప్ప. తింటానికి గింజలేదు. ఆ మిడతల గుంపులు ఆకాశాన్నే కప్పి సూరుడిని కప్పేశాయి. పెపంచకం మీద పెద్ద గొడుగు కప్పినట్టయిందంటే నమ్మండి! ఆ యేడు మా పంటంతా నాసనమయింది... ఆ మిడత ఒక్క గడ్డిపోచని వదల్లేదు! అదేంటోగాని అప్పుడు కూడ ఇంత బాధ పడలేదు...ఎలాగో కాలం గడిపేసాము. దేవుడిదయవల్ల రోజులుమారి మా కష్టాలు గట్టెక్కాయి ... వాటిని మరిసేపోయాం. కానయితే, ఈ రోజు మా కష్టాలు దేవుడి శాపం మూలకంగా వచ్చినవి కావు! అవి మనుసులు తెచ్చిన కష్టాలే!—

'బాబూ, అయిదుసంవత్సరాలుగా ఎందరు మాడిపోతున్నారో చెప్పలేను... మా గొడ్లు మా కల్లముందే చస్తున్నాయి గడ్డిలేక! అంతా తమరు పొగిడిన ఆ సెరువు మూలకంగానే...!'

'ఏమిటీ? ఆ చెరువువల్లనా?' మంగేష్‌రావ్ ఆశ్చర్యపడ్డాడు.

'అవును బాబూ, అవును! ఆ సెరువే!' అని జవాబు ఇచ్చాడు ముసలి రయితు. 'అయిదేళ్లకిముందు అక్కడ సెరువులేదు. అదంతా ఒక పెద్ద 'ఖాజన్' (ఉప్పునీటితో కలిపి సాగుబడిచేసే పొలం రకమయిత). మా ఊరికి లచ్చమణుగుల వరి ఇచ్చేది! మా తాత ముత్తాతల కాలంకాడినుంచి రయితులమంతా సొంతంగా సాగుబడి చేసుకునే వాల్లం. మా చెమటోడిసి సేసిన ఆ సేద్యం మా కడుపులు నింపింది— మా ఆలిబిడ్డలకి కొంత గంజిపోసింది! ఎన్నో తడవలు చేతులు మారిందంటారు గానయ్యా, దేసాయిడో దొరల తాతగారు దీన్ని కొన్నారు. అప్పటి నుంచి వారి కుటుంబంలోనే ఉంది...

'అంతకిముందు ఒకభాగం వో సెర్వకారు గారిదీ మరోబాగం వో పంతులిదీ—వాళ్లే మా పొలాల్ని ఎవరో సేపలుపట్టే మనిసిదగ్గర కొన్నారని మాతాత సెప్పేవాడు... ఈ సేపల మనిసి బాగా డబ్బున్నోడు, అతనికో నావ కూడా ఉండేదిట బాబూ! ఇంతకి నే సెప్పేదేంటంటే, ఆ నావ సొంతదారుకాడి నుంచి ఈ నాటిదాకా సాగుబడిసేసింది మేమే మా నాగలి తప్ప దున్నలేదీ గడ్డని! అందుచేతనేగదు బాబూ దసరా సంబరాలప్పుడు అమ్మవారికి మొదటి టెంకాయ కొట్టేది మా కుటుంబం? బాపనయ్యల పూజలు కూడా మా టెంకాయ కొట్టింతర్వాతనే కదూ?'

'అలాగా?' అన్నాడు మంగేష్‌రావ్ చిరునవ్వుతో. అతని చిరునవ్వుతో ప్రతిబింబించిన సానుభూతి, సహృదయత వృద్ధుడికి ఎంతోసంతోషం కలిగించాయి.

అమ్మవారి మాట రావటం, కొబ్బరికాయ కొట్టటం గుర్తుకి రావటం వృద్ధుడి హృదయంలోని భక్తి భావాలని మేదిపాయి. వయసు మళ్ళిన అతని కళ్లలోకి ఏదో వింత కాంతి వచ్చింది. దేవాలయం వంపు చెయ్యిజాపి కొద్ది క్షణాల తర్వాత కొద్దిగా వణికే గొంతుకతో మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు.

'కానయితే అయ్యా, ఈ గవురవం సాలికొకసారి మాత్రమే దక్కుతుంది మాకు. మిగతారోజుల్లో మా వంక దక్కు కూడా సూడదు కదా! అందుచేతనే ఈ బాదయి మాకు...'

'ఇప్పటి యజమానుల తాతలనాటి వెవారానికీ నేటి వెవారాలకి ఎంత తేడా ఉంది... ఆ దినాల్లో ఆవాగు పొలాలన్నిటిలోకి పారేది! అటు. పోటు నీటని వెక్కలతో పట్టేసేవాళ్లం. అంతా బలేబాగా సాగేది. ఈ కట్ట ఎంత గట్టిగా ఉండేదంటే ఎన్నాను నాడూ, అమావాస్యనాడు కూడా ఖజన్‌లో

నీరు సరిగ్గా ఉండేది. అయిదేళ్ల మునుపు ఇదంతా మారిపోయింది. కట్ట తెగి ఉప్పు నీరంతా చేలలోకి పారింది. మంచి ఖాజిన్ ఆ దరిద్రపు గొట్టు సెరువయిపోయింది! అసలు కట్టకి పడ్డగండి చాలా సిన్నది. అప్పుడే కట్టేసుంటే అంతా సరిగ్గా ఉండేది ... కాని, బాబాసాయెబ్, రావు సాయెబ్బుల మద్దెన కొట్లాట వచ్చేసింది.'

'ఇద్దరూ అన్నదమ్ముల బిడ్డలు. బాబా సాయెబు తండ్రి ఇద్దర్లో పెద్దారు. ఈ ఖాజన్ ఇద్దరి సొమ్మా! బాబూ, మొదట్లో అందరూ సుకంగా కలిసుండేవారు రెండు కుటుంబాలు పెద్దయ్యగారింట్లోనే ఉండేవారు ఈ మద్దెనే కదా రావు సాయెబుగారి కుటుంబం ఆ కొత్త ఇంటికెళ్లింది? విడిపోయినతాలనుంచీ ఇద్దరి మధ్య కొట్లాటలు పెరిగిపోయినాయి. పంట పంపకంలో వచ్చింది పిక్కు! ఈ కోపంతో గండి పూడవటం మానేశారు. ఇక కేంది, కట్ట బాగా గండిపడిపోయింది. సముద్రం పోటు వచ్చినప్పుడెల్లా ఉప్పునీరు లోపలికొచ్చేస్తది. ఈ సెరువు మీ కళ్లకి సక్కగా ఉందంటరు! అయిదేళ్లముందు వచ్చుంటే మీ కళ్లకింకా చక్కటిది కనిపించేది బాబూ!! ఉప్పునీటిలో పెరిగే ఈ దరిద్ర గొట్టు 'ఇంపల్', 'చిపీ' పాదల బదులు పైనా సక్కని వరిచేను సూసేవారు! ఈ చోటంతా గొడ్ల మందలు మందలుగా మేసేవి బాబూ ... ఎంత పచ్చికుండేదో ఇక్కడ తెల్సా? ఇప్పుడు వాటికీ సెత్తమేపాలొచ్చింది...

'బాబూ ఆకాలంలో ఈ సోటంతా కూలిజనంతో, పిల్లల్తో, ఎడ్లబళ్లతో కిటకిట లాడిపొయ్యేది ... సాలు పొడుగుతా ఏదోపని సూసుకు నేవాళ్లం...'

భావావేశంతో చెప్తున్న వృద్ధుడి మాటలకి మంగేష్‌రావ్ అడ్డురాకుండా ఉండలేకపోయాడు.

'అయ్యో పాపం మీవాళ్లకిది పెద్ద నష్టమేనే. మరి మీ భూస్వాములకి కూడా నష్టమేకదా, కట్ట నెందుకు బాగు చెయ్యరూ?' అని అడిగాడు పానుభలాతి ఉట్టి పడేట్టు.

ముసలి రయితు ఈ ప్రశ్ననే ఎదురు చూశాడు. కనుబొమలు పైకెత్తాడు. 'తెలుసుకుంటే సెయలేని పవా బాబూ వారికది? ఆ కోర్టుల్లో తగవులకి కర్చుచేసిన దాంట్లో పదోవంతు పెట్టినా సరిపోయేది. వారంలో గట్టు బాగుచేసేవాళ్లం. కాని, తగ్గేదెవరు? వాల్ల మధ్యనపడి మేము మునిగిపోతున్నాం.' అన్నాడు. 'అంతేకాదు బాబూ! మాలాంటోళ్లకి ఇది తప్ప బతుకు తెరువులేదు. వాళ్లు మహారాజులు! ఎలాగయినా గడుస్తది. ఎంత కర్చయినా పెట్టుకుంటారు. పట్టినపట్టు ఇడవరాదని పంతం! రెండు ఎనుబోతులు గుద్దుకుంటూంటే మధ్యపడిన సెట్టుగతేం కావాల?'

ఇంతలో పక్కనే ఉన్న ఒక కొబ్బరి తోపులోనుంచి వారికి అరుపులు, పాటలు వినిపించాయి. ముసలివాడు ఒక క్షణం అటువయిపు తల పంకించి శ్రద్ధగా విన్నాడు. తర్వాత, 'సూశారా, మేమేమో ఇక్కడ తిండిలేక మాడి సస్తావుంటే ఆ ఉత్తరాది ఆబోతులు ఎలా మెక్కుతున్నారో? ఆ తోపులో కాయలన్నీ వాళ్లకే! ముందు రోజుల్లో మేము కాపలా కాసినప్పుడు ఒక పుల్ల పోనిచ్చేవాళ్లమా?' అన్నాడు ఆవేశంతో. ఇక చెప్పలేక చిన్న మూలుగుతో నేలమీద కూలబడ్డాడు 'ఇప్పటి వెవ్వారమే వేరు, రోజులు మారాయి' అని వాపోయాడు.

'ఈ ఉత్తరాదివాళ్లు మీ గ్రామానికెలా వచ్చారు?'

'సెబుతున్నాగదు బాబూ... కామందుల మద్దె కొట్లాటలు ఎక్కువయిపోయినాయి. మొదట్లో పనివాళ్లు, కూలీజనం తగువులాడుకునేవాళ్ళు ఆర్నెల్లకితం రావుసాహెబ్ గారి పని పట్టించాలని పెద్దాయన ఈ పూర్‌భయ్యా (ఉత్తరప్రదేశ్‌నుంచి వచ్చిన వారిని ఇలా పిలుస్తారు) మూకని తెప్పించారు. బొంబాయి నుంచి వచ్చారుట వీళ్లంతా! కుక్కల్లాగ తిండి పడేసినవారి జట్టుంటారు పాలు, నెయ్యి, పంచదార, పూరిలు తెగమేసి ఊరిమీద పడ్తారు. వారి పాలకం సూడాలి బాబూ - మీరు— సొక్కా సేతులు పయికి మడిసి ఎదుటి మనుసులతో జగడానికి దిగుతారు ఇదే వాళ్ల ఉద్యోగం! వేరేలేదు. సరే రావుసాహెబ్‌గా రూరుకుంటారా? బొంబాయినుంచి పఠాన్లని తెప్పించారు!'

'ఏమిటీ, దేష్‌పాండే లాంటి గొప్ప కుటుంబంలోవారు ఇంత నీచానికి దిగారా?' మంగేష్‌రావ్ ముఖంలో ఆవేదన కనిపించింది.

'తమ రయితులకోసమయినా ఈ పోట్లాటలు మానుకోవచ్చునే! వాళ్లేమిటి మనుషులా, రాక్షసులా! లక్షణమయిన ఖాజిన్ ఇలా ఉప్పునీటితో నాశనమయిపోతూ ఉంటే, ప్రజలు మాడుతూ ఉంటే-చూస్తూ ఊరుకుంటున్నారు!'

మంగేష్‌రావ్ మాటలు ముసలి రయితుకి కోపాన్ని, సంతృప్తినీ రెండిటినీ కలిగించాయి. తమ బాధలని చూసి జాలిపడుతున్నాడని సంతృప్తి; తమ భూస్వాములని దూషిస్తున్నాడని కోపమూ. కొంచెం తికమక పడ్డాడు.

'అదేంటి బాబూ అలా గంటారు?' అన్నాడు.

'మా కామందులు మేమంతా మాడి సావలని కోరుకుంటున్నారా? వాళ్ళమట్టు కేంజేస్తారు? వారి పంతాలు, పట్టింపులు వేరు! పరువుకోసం ఎంత దూరమయినా పోతారు. మాలాటి దెరిద్రులు పొట్టకోసం ఇలా పాకులాడుతా ఉంటాము ... వాళ్ళ కష్టాలు వాళ్ల కుంటాయి. కోర్సు వెవారాలంటే మాటలా ఏటి? మాబోటి సదువు లానివారి కివన్నీ ఏం తెలస్తాయి?...

వృద్ధుడి ధోరణిలో హఠాత్తుగా కలిగిన ఈ మార్పు మంగేష్‌రావ్‌కి ఆశ్చర్యం కలిగించింది. అతని విశ్వాసానికి చిరునవ్వు నవ్వుకున్నాడు. ఇంతలోనే ఈ కబుర్లు వింటూ ఎంతో కాలం వృథాచేసినట్లు గ్రహించి,

'సరేలే అన్నా! అట్లాగే కానియి. మీ కామందులది తప్పయినా కాకపోయినా దేవుడున్నాడుగా పయిన! అంతా సరిచేస్తాడు చూస్తూ వుండు...'

'మీ నోట చక్కెర పొయ్యాలి బాబూ!' ముసలిరయితు మాటల్లో ఎంతో కృతజ్ఞత ఉంది.

'మీ కామందు బాబాసాహెబ్ దగ్గర కెళ్లాలి దారెటు?'

ఈ ప్రశ్న మంగేష్‌రావ్ ఎంతో సాధారణంగా వేసినా వృద్ధుడికి అతనిమీద గౌరవభావం అధికం అయేట్టు చేసింది.

'నిజంగా మీరు మా అయ్యగారింట్లో దిగుతున్నారా బాబూ? ముందే చెప్పకపోయివారా? రండి బాబూ రండి, తీసుకెడతా-'

అంటూ మంగేష్‌రావ్‌ని తీసుకువెళ్ళాడు. 'మా అయ్యగారెంతో సంతోషిస్తారు ... మీది బొంబాయా బాబూ? నాత్రోజు ఉంటారా?'

'అంతకన్నా భాగ్యమా? బాబాసాహెబ్‌తో నాలుగురోజులు గడపటంకన్నా మంచి పనేముంది? కాని ఈ సాయంత్రమే నేను తిరిగి వెళ్ళిపోవాలి. ఈ ఊళ్ళో ముఖ్యమైన వనొక టుంటే చూసుకుపోదామని వచ్చాను.'

'ఏంటీ – ఇయాలే తిరిగెళ్ళిపోవాలా?' వృద్ధుడు నవ్వుకున్నాడు. 'అదెప్పుడయినా జరిగేపనే? మా బాబాసాయెబ్‌గారింట్లో ఒక వారంరోజులయినా ఉండోపోతే ఆయ నొదుల్తారా? ఏదో రెండుగంటల్లోండి తిరిగి పోతానంటే బాబాసాహెబ్ వప్పుకోనే వప్పు కోరు! నే సెప్పింది నిజవో కాదో మీరే సూస్తారుకద బాబూ!'

ఇద్దరూ బాబాసాహెబ్ యింటిదగ్గరికి రావటంతో ముసలివాడు తన సంభాషణ అంతటితో ఆపివేశాడు.

* * *

అదొక పెద్ద రెండంతస్థుల రాతిమేడ: ఇంటిచుట్టూ పెద్ద తోట; తోటలో ఒక వయిపు విశాలమయిన గొడ్లసావిడి, దాని పక్కనే గుర్రపుశాల. అంత పెద్ద సావిడి లోనూ మూడు నాలుగు గొడ్లకన్నా కని పించలేదు. గుర్రపుశాలలో గుర్రం లేదు కాని తుప్పు పట్టిపోతున్న బండీ, దుమ్ము కొట్టుకుపోయిన పల్లకీ ఒకటీ మాత్రం ఉన్నాయి. నేలమీద కొబ్బరిచిప్పలు, కట్టెలు, కుళ్ళిపోతున్న గడ్డివామ్లూ చిందరవందరగా పడిఉన్నాయి. ఈ సావిడి ఉన్న అవతలవయిపు మామిడి, పనస, జామచెట్లు; వాటిమధ్య అక్కడక్కడ మారేడుచెట్లు, తులసిమొక్కలు; ఒక పక్కగా వెదురుపుల్లల కంచె మధ్య పోర్చు గీసు వారు ప్రవేశపెట్టిన ఆధునిక పద్ధతిలో పూలతోట వెయ్యాలని ప్రయత్నం చేసినట్లు సూచనగా కనిపించే విరిగిపోయిన మట్టిపూల తొట్టెలు; మంగేష్‌రావ్ మేడ వయిపు చూశాడు. ఇంటి కుడివైపు ఒక వైపు ఒక మూల సగం కట్టిన బాల్కనీ కనిపించింది.

పోర్టికోలోకి కాలుపెట్టగానే అక్కడే ముడుచుకుని పడుకుని ఉన్న ముసలికుక్క ఒకటి గుర్రుమన్నది. ఇది విన్న పనిమనిషి ఒకతను బయటికి వచ్చాడు. మంగేష్ రావ్‌ని సవినయంగా పలకరించి లోపలికి తీసుకు వెళ్ళాడు. యజమానిని పిలుచుకురావటానికి లోపలికి వెళ్ళాడు. అది ఒక పెద్ద హాలు. నేలమీద పండటానికి గడ్డిలో పెట్టిన మామిడికాయలు చాలా ఉన్నాయి. ఒక మూలగా కొన్ని కుర్చీలు, సోఫాలు ఉన్నాయి. పైన దూలాలమీద కూర్చునిఉన్న పావురాలు వాటిని బాగా ఖరాబు చేసివేశాయి. మంగేష్‌రావు జాగ్రత్తగా ఒక సోఫా అంచు మీద కూర్చున్నాడు. అది తక్కినవాటికన్నా కొంచెం శుభ్రంగానే ఉన్నా అందులో అప్పటికే ఒకపిల్లి, దాని కూనలు పడుకుని ఉన్నాయి. పిల్లికూనలు పాలకోసం ఎగబడు తున్నాయి.

చూరుమీద నుంచి దీపాలగుత్తులు వేళ్ళాడుతున్నాయి. మంచి శిల్పంకలవే, కాని శిథిలావస్థలో ఉన్నాయి. గోడలకి తగిలించి ఉన్న పొడుగాటి నిలువద్దాలు మాసిపోయాయి. వాటిపక్కనే వేళ్ళాడుతున్న కత్తులు తుప్పుపట్టిపోతున్నాయి; ఈటెలు, తుపాకులూ కూడా అంతే. ఆ హాల్లోని పటాలుమాత్రం మంచి స్థితిలోనే ఉన్నట్లు కనిపించాయి. అవి చాలామట్టుకు వర్ణ చిత్రాలు, ఛాయాచిత్రాలు దేవి, దేవతల బొమ్మలు గాజుమీద వేసినవి. ఒక్కొక్కటి కనీసం వంద సంవత్సరాల కిందయినా వేసినదే. ఛాయాచిత్రాలలో ప్రముఖంగా కనిపించేవి పోర్చుగల్ ఏలిన చివరిరాజులు దోన్ కార్లోస్, దోన్ మాన్యుయెల్ లవి; వారి తర్వాత వచ్చిన ప్రజాస్వామ్య నాయకులు దకాతూర్ మాన్యుయెల్ ద అరెయగా, దూతూర్ అల్మెయిదాలవి. వాటిని చూడటంలో మునిగిపోయిన మంగేష్ రావ్‌ని ఒక లావుపాటి వ్యక్తి వచ్చి చిరునవ్వుతో పలకరించాడు. అతనే బాబాసాహెబ్. మంగేష్ రావ్ తనని పరిచయం చేసుకున్నాడు. ఇంతలో ఒక పనిమనిషి 'హుక్కా' తీసుకు వచ్చి అతిథికి ఇచ్చాడు. మంగేష్‌రావ్‌కి పొగ తాగటం అలవాటులేదు. బాబాసాహెబ్ నవ్వుకున్నాడు; హుక్కాని తీసుకుని కొన్ని గుక్కలు పీల్చాడు. పనిమనిషికి తిరిగి ఇచ్చేస్తూ, ఆడవారితో అతిథికి టీ తయారు చెయ్యమని చెప్పమన్నాడు. టీ వచ్చేలోపల లేత కొబ్బరిబొండాల నీళ్ళు తీసుకు రమ్మన్నాడు

మంగేష్‌రావ్ తన తాతగారికీ, బాబాసాహెబ్ పెదనాన్నగారికీ కల స్నేహంగురించి చెప్పుకున్నాడు. ఇద్దరూ జూదగాళ్ళే. బాబాసాహెబ్‌లో ఎన్నో జ్ఞాపకాలు మెదిలాయి. మంగేష్‌రావ్ భుజంమీద చెయ్యివేసి, 'భలే వారే! భవానీ బాబా మనవలా! ఆహా, ఎంత మంచివాడతను! అతనంటే మాకందరికీ ఎంత గౌరవం, ఎంత ఆపేక్ష...అసలు పరాయివాడికిందే అనుకునేవాళ్ళం కాదే...! ఏటా దసరాకి మా యింటికి వచ్చేవాడు. రెండు నెలలుండి వెళ్ళేవాడు...ఇక ఆరెండు నెలలూ ఒకటే జూదం, ఒకటే జూదం, మా పెదనాన్నా, ఆయనా! పగలూ రాత్రీ తెలిసేదికాదు వాళ్ళిద్దరికీ... భవానీ బాబా ఉంటే మా పెదనాన్నకి ఎంతో ధైర్యం! ఎటువంటి జూదగాణ్ణయినా సవాలుచేసేవాడు...! వంటిమీద బట్టల్ని కూడా వదలకుండా దివాలా ఎత్తించేవాడు...' బాబాసాహెబ్ ఆ జూదగాళ్ళిద్దరి ప్రతాపాలని గురించీ చెప్పుకుపోయాడు. గోవాలో వాళ్ళు చూసిన ప్రతి జూదరులకొంపని గురించీ చెప్పాడు. అయితే ఈ వర్ణనలు పని మనుష్యులు తీసుకువచ్చిన కొబ్బరి బొండాల నీరు తాగటానికిగాని, తర్వాత వచ్చిన టీ, మిఠాయిలు ఆరగించటానికీ గాని అడ్డురాలేదు. తన అతిథిని కూడా మొహమాట పడకుండా తినమని మధ్య మధ్య హెచ్చరిస్తూనే వున్నాడు. ఇదంతా పూర్తి అయేసరికి గంట పట్టింది.

'నిజమేనండీ! భవానీబాబా భలేమనిషి... అతని సాహసం మూలంగానే మా పెద్ద నాన్న ఆ రోజుల్లోనే గోవాలో అంత పెద్ద జూదరనే కీర్తి సంపాదించుకున్నాడు!' అని పూర్తిచేశాడు చివరికి.

మంగేష్‌రావ్ తను వచ్చిన పనేమిటో చెప్పటానికి ప్రయత్నించాడు రెండు మూడు సార్లు. కాని అతని ప్రయత్నాలు బాబాసాహెబ్ అభినయాలని, నవ్వుని, కథనాన్ని ఆపలేకపోయాయి. పనిమనిషి ఒకడు కొబ్బరి నూనెగిన్నెతో వచ్చేదాకా బాబాసాహెబ్ వాగ్ధోరణికి అడ్డులేకపోయింది. పనివాడు కొబ్బరినూనె అతనిముందు వుంచి పేజ్ (పొద్దున ఫలహారం)కి వేళ అయిందని గుర్తు చేశాడు. బాబాసాహెబ్‌కి అతిథి మర్యాద

మరొకటి ఉందనీ జ్ఞాపకం వచ్చింది.

నూనెగిన్ని మంగేష్‌రావ్‌కిచ్చి పైవంటి మీద చొక్కా తీసివేశాడు ఇద్దరూ వంటికి నూనె పట్టించుకోవటం ప్రారంభించారు. (గోవాలో స్నానం ముందు నూనె రాసుకోవడం అలవాటు) ఇంతలో పిల్లి పైనా ఒకటి అమాంతంగా మంగేష్‌రావ్ వీపు మీదకి దూకింది కంగారు పడిపోయిన మంగేష్‌రావ్ నూనె గిన్నెని తోసివేశాడు. నూనె అతని ధోవతి మీదంతా ఒలికింది. బాబాసాహెబ్ జరిగినదానికి క్షమాపణ చెప్పుకున్నాడు. పని మనిషిని కేకలువేశాడు 'శానో, నీకసలు బుద్ధి ఉందా లేదా? పావురాళ్లూ, కాకులూ, పిల్లులూ, ఎలుకలూ అన్నీ పెంచి మా ప్రాణాలు తీస్తావు! ఇది దేశ్పాండేల 'డ్రాయింగ్ రూమ్' అని నీకు తెలీదా? ఇక్కడికి ఎంతమంది యూరోపియన్ అధికారులు వచ్చారు? వాళ్లందరూ వచ్చి కూచున్న ఈ గదిని నువ్వొక గొడ్లసావిడి చేసేస్తున్నావ్!'

బాబాసాహెబ్ మాటలు చురుకుగానే ఉన్నప్పటికీ పిల్లికూన వంక చూసినప్పుడు అతని కళ్లల్లో ఉట్టిపడే వాత్సల్యం మంగేష్‌రావ్ గమనించకపోలేదు ఈసంఘటన వల్ల ఇంకా ఏమి ముంచుకువస్తుందోనని లోపల కొంచెం అదుర్దా చెందాడు.

ఇద్దరూ స్నానాలు ముగించుకుని, కొత్త బట్టలలోకి మారారు వంటింట్లోకి వెళ్లి పీటలమీద కూర్చున్నారు. విందు చెయ్యి పెట్టినట్లు మంగేష్‌రావ్ గ్రహించాడు... అతని ముందు పెద్ద లోటాలు, మెత్తటి రొట్లూ, సాంబార్, అప్పడాలూ, పచ్చళ్లూ, ఊరగాయలూ సిద్ధంగా ఉన్నాయి.

కబుర్లు ఎంత చెప్పే తిండి అంతబాగా అరుగుతుందని బాబాసాహెబ్ నమ్మకంలాగ ఉంది. ఫలహారం చేస్తూ చెప్పుకుపోయాడు: 'అసలు శానో వాడి పేరు కాదు తెలుసా? వాడికా పేరు మా అమ్మ పెట్టింది వాడంటే ఆవిడకి ముద్దు! ఏడేళ్ల కుర్రవాడుగా మా ఇంటికి వచ్చాడు—తలిదండ్రులు లేరు అసలా పేరేమిటి! 'శానో' (అంటే తెలివిగలవాడు) అని ఈ బుద్ధిలేనివాడిని పిలవటమా?' బాబాసాహెబ్‌కి నవ్వు ఆగలేదు. కథ చెప్పటం ఆపవలసివచ్చింది. తేరుకున్న తర్వాత ఫలహారం కొంత పుచ్చుకున్నాడు. ఈ పని ముగించిన తర్వాత శానో తెలివితక్కువ ప్రతాపాలని గురించి అరగంటసేపు చెప్పాడు. అప్పటికి తిండి పూర్తి అయింది. బాబాసాహెబ్ తన అతిధిని కాసేపు కునుకు తియ్యమని పడక గదిలోకి తీసుకువెళ్లాడు. పడుకునేముందు, 'అంతా విన్నారు మీరు! ఈ శానోగాడికి పెళ్లి చేయించాను—అయిదు వందలు ఖర్చుచేసి—అవును, అయిదువందలు! కాని ఏం లాభం?' అని విరగబడి నవ్వాడు. 'అంతా గందరగోళం—పెళ్లాన్ని తెగ గారాబం చేశాడు. ఏముందీ, ఆ పిల్ల ఏడాది క్రితం వీడిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది తిరిగిరాదుట—ఎంత అవమానం!'

బాబాసాహెబ్‌కి నిద్ర వస్తోంది. రోజూ ఆవేళకి ఒక కునుకు తియ్యటం ఆయనకి అలవాటు. కాని, కథ చెప్పటం పూర్తికాలేదేమో ఇంకా మాటాడుతూనే వున్నాడు. 'బాబూ శానో పెళ్లాన్ని యింటికి రమ్మని కబురు పెడితే ఏమందో తెలుసా? నాకు బంగారు గాజులు చేయించు, తిరిగివస్తా, అంది.' ఏమిటి విపరీతం? గొడ్లుకాసేవాడి కూతురికి బంగారుగాజులేమిటి? కాని, ఈ వెర్రివెధవని గాజులు పెట్టమంటుంది! నేనేమో వాడితో, 'పెళ్లాం పోతే పోయింది. మళ్ళీ పెళ్ళిచేస్తా, భయపడకు!' అన్నాను. వెయ్యిరూపాయలు ఖర్చయినా సరే ఫర్వాలేదన్నాను! అప్పుడేంచేస్తుందా పిల్ల?'


మంగేష్‌రావ్ తను వచ్చిన పని గురించి చెబుదామని ఎంత ప్రయత్నించినా బాబాసాహెబ్ చెప్పనివ్వలేదు. పోనీ, ఇంత సంతోషంగా వున్నాడు. ఇప్పుడు చెప్తే వింటాడేమో అని, 'బాబాసాహెబ్‌గారూ, మిమ్మల్ని పొగడుతున్నా ననుకోకండి, కాని యింట్లో పని మనుషుల దగ్గరే ఇంత దయ చూపిస్తున్నారంటే అది మీ వంశ సాంప్రదాయానికీ తగినదే కదా! ఇందరికీ సాయం చేశారు, నా కోరిక కూడా వినండి. మీతో పని పెట్టుకుని ఇంత దూరం వచ్చాను' అన్నాడు.

బాబాసాహెబ్‌కి నిద్ర ముంచుకువస్తోంది. ఈ ప్రశంస విని సంతోషించినా ఇక మాట్లాడే వోపిక లేక మంగేష్‌రావ్ మాటని నవ్వుతూ తోసివేశాడు. 'భయపడకండి! మీరంత పని కట్టుకొస్తే అదేమిటో పూర్తికానిదే పంపించేస్తానా ఏమిటి నేను! ఇది దేశ్పాండే ఇల్లు ఏమన్నానా? మీరు చెప్పటమే తరవాయి నేను దాన్ని తీరుస్తాను. అవునుగాని, ఇంత ఎండలో నడిచి వచ్చారు కాసేపు కన్ను మూస్తే మంచిది. తర్వాత అన్నీ మాట్లాడుకుందాంలే...' ఈ విధంగా అతిధి తొందరపాటుని అతి మర్యాదగా నెట్టివేసి, మరొకసారి నిద్రపొమ్మని చెప్పి బాబాసాహెబ్ తనూ కన్ను మూశాడు. చిటికలో గుర్రుపెట్టటం ప్రారంభించాడు.

మంగేష్‌రావుకి పగలు నిద్రపోవటం అలవాటు లేదు. బాబాసాహెబ్ ఇలా గుర్రుపెట్టి నిద్రపోతూ ఉంటే తనేమిటి చెయ్యాలో తోచలేదు.

కలతగా రెండుగంటలు గడవాడు. బాబా

(63 వ పేజీ చూడండి)



# తామ్రశాసనం

(37వ పేజీ తరువాయి)

సాహెబ్ ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. ఏమిటి చెయ్యాలా అని ఆలోచిస్తూ ఉండగానే శానో గదిలోకి వచ్చాడు. కొంచెం సందేహిస్తూనే బాబాసాహెబ్‌ని, 'అయ్యగారూ...అయ్యగారూ...' అని పిలిచాడు.

బాబాసాహెబ్ ముఖం చిట్లించి కళ్ళు తెరిచాడు కాని, శానో, 'అమ్మగారు భోజనానికి ఆలస్యం అవుతుందంటున్నారు... కొత్త బాబుగారు కూడా ఉన్నారు...' అనగానే చురుకుగా లేచికూర్చున్నాడు.

దేష్పాండె ఇంట్లో పనివాళ్ళు 'తమ యజమానికి ఇష్టంలేనిది ఏదయినా చెప్పవలసివచ్చినప్పుడు, 'అమ్మగారు అంటున్నారు' అనే మంత్రాన్ని వాడుతూ ఉండేవారు. శానో మాటలలోని మహిమ వెంటనే కనిపించింది. మరొక గంటసేపు పడుకుందామనుకుంటున్న బాబాసాహెబ్ వెంటనే ఒకసారి ఆవులించి లేచికూర్చున్నాడు.

అతిథిపట్ల తనకన్నా ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్న ఆడవారి బుద్ధిని పొగడుతూ మంగేష్‌రావ్‌ని భోజనాల గదిలోకి తీసుకువెళ్ళాడు.

'బాబూ, ఇది మా ఇంట్లో ఒక పాత సంప్రదాయం.' అన్నాడు ఇద్దరూ కూర్చుంటూ ఉండగా 'ఆడవాళ్ళని ఇంటి వ్యవహారాలన్నిటిలోనూ కలగచేసుకోనివ్వంగాని వంటింటి పెత్తనం అంతా వారిదే!'

ఈ సాంప్రదాయంలోని మూల సిద్ధాంతాన్ని ఇలా సూత్రీకరించి బాబాసాహెబ్ దానిని గురించి వివరంగా చెప్పకుంటూ పోయాడు. ఇంటికి అతిథి రాగానే ఆడవారు ఏ విధంగా వంటమనిషిని హెచ్చరిస్తారో, తమే, ఎలా వంటఇంట్లో అన్నివిధాలా కలగచేసుకుంటూ ఉంటారో, 'మంచి చెయ్యి ఉన్నవారినే ఎందుకు వడ్డనకి నియమిస్తారో, కుటుంబంలో వారంతా—ఇంటి పెద్దతో సహా—అతిథి సత్కర్యం కోసం ఎట్లా సర్దుకుపోతూ ఉంటారో, ఆడవారు విధించే వంటింటి శాసనాలని ఎలా శిరసావహిస్తారో చెప్పాడు. అసలు ఇంట్లోవారేమిటి, అతిథులు కూడా వంట ఇంటి నుంచి వచ్చే ఆజ్ఞని శిరసావహించవలసిందే, అన్నాడు. ఆడవారు అంత సంతోషంగా తయారు చేయించిన, చేసిన వంటకాలని కడుపునిండా తిని తమ కర్తవ్యాన్ని నిర్వహించాలన్నాడు.

మంగేష్‌రావ్ 'పేజ్' సరిగా సేవించలేదని బాబాసాహెబ్ పై కర్తవ్యాన్ని మరింత నొక్కిచెప్పాడు: ఇప్పుడయినా భోజనం సరిగ్గా చెయ్యాలని హెచ్చరించే ఉద్దేశంతో.

ఇక మంగేష్‌రావ్ సంగతి—ఫలహారమే అంత పుష్టిగా ఉంటే ఈ భోజనం వర్ణనాతీతంగా ఉందనుకున్నాడు.

పెద్ద వెండికంచాలలో అన్నం వడ్డించిన తర్వాత పచ్చళ్ళు, ఊరగాయలు, కూరలు, ఎన్నో రకాలుగా వండిన చేపలు, ఆల్చిప్పలు పెట్టారు. భోజనం జరుగుతూ ఉంటే అన్నంమీద పప్పుకూరలు, కొబ్బరి పాలతో వండిన కూరలు వడ్డించారు. చక్కటి తిరగమాత చేసిన వాటి ఘుమఘుమలతో ఆ గది నిండిపోయింది. భోజనం ముగియటానికి ఇంచుమించు గంట పట్టింది. తింటున్నంతసేపూ బాబాసాహెబ్ మంగేష్‌రావ్‌తో మీ తాత భవానీబాబా పేరు నిలబెట్టాలంటూనే ఉన్నాడు. భవానీబాబా ఎంత బాగా తినేవాడో తనకి తెలుసునన్నాడు.

పాయసం వడ్డనతో భోజనం అయిపోయిందని తెలుసుకున్న మంగేష్‌రావ్, 'బాబాసాహెబ్‌గారూ, మీ ఆతిథ్యాన్ని వర్ణించే శక్తి నాకులేదు. మీ ఆదరాభిమానాలకేవిధంగా కృతజ్ఞత చెప్పుకోవాలో నాకు తెలియటంలేదు.' అన్నాడు. నిజంగానే బాబాసాహెబ్ ఆదరం మంగేష్‌రావ్‌ని కదిల్చివేసింది. కాని, తను వచ్చినపనిగురించి చెప్పే అవకాశం కూడా కలుగచేసుకోవాలని అతని ఉద్దేశం. 'దేష్పాండేల కీర్తికి తగినట్లే ఉంది మీరు నాకు చేసిన మర్యాద. నేను దానికి తగను. ఇలా మీ ఇంటిభోజనం చెయ్యగలగటం కేవలం నా అదృష్టం! అయ్యా, నేను మీతో సరితూగే అంతస్తువాడినికాను! బొంబాయిలో గుమాస్తాపని చేసుకుంటూ పొట్ట నింపుకునేవాడిని... నావంటి అతి సామాన్యుడిని గౌరవించటానికి మీరూ, మీ ఇంటివారూ, ఇంత శ్రమకి లోనయ్యారంటే అది నా అదృష్టం! ఈ రోజుని నే నెప్పుడూ మరిచిపోలేను... పాయసం ఎంత మధురంగా ఉంది! చేపకూరలు ఎంత రుచిగా ఉన్నాయి! కొబ్బరి పాలకూర ఎలా ఉందో ఏమి చెప్పను! ఆల్చిప్పలు...'

ఈ పొగడ్తలు బాబాసాహెబ్‌కి రుచించక పోలేదు. మంగేష్‌రావ్ ఆల్చిప్పల సంగతి ఎత్తకపోతే ఆనందంగా వింటూఉండేవాడే, మంగేష్‌రావ్‌కి తను వచ్చిన పనిగురించి చెప్పే అవకాశమూ ఉండేది. కాని 'ఆల్చిప్పలు' అన్న పదం వినగానే, 'ఆహా, ఆల్చిప్పలేనా 'భలేఉన్నాయి కదూ! వాటిని గురించి చెప్తా వినండి!' అన్నాడు మెరిసే కళ్ళతో. 'ఇవాళ మనం తిన్న ఆల్చిప్పలు మామూలు చేపలబజారులో దొరికేవి కావు! అది మన సొంత చెరువులోనివి...అసలు



అమెరికన్ విమెన్స్‌క్లబ్, మద్రాసు అధ్యక్షురాలు శ్రీమతి ఎడ్డి ఓర్ ఫీల్డ్ మద్రాసులోని బాలవిహార్‌కి బహూకరిస్తున్న చెక్కుని అందుకుంటున్న రాష్ట్ర హరిజన సంక్షేమశాఖామాత్యులు శ్రీమతి సత్యవాణీముత్తు. మద్రాసులోని అమెరికన్ కాన్సల్ జనరల్ సతీమణి శ్రీమతి ఆల్బర్ట్ ఫ్రాంక్లిన్, శ్రీమతి మేరీ క్లబ్ వాలాజాదవలను కూడా ఫొటోలో చూడవచ్చు.

**మీరూ కుట్టుపని నేర్వండి**



వేలాదిమందికి నేర్పితిని. నా పుస్తకాల ద్వారా అనేకులు నేర్చిరి. లాగ్చీ, షర్టు, జాకెట్లు, గౌన్లు, డ్రాయర్లతో 30 రకా॥ కత్తిరించి కుట్టేటి 384 పే 400 బొ. రు **8.** బట్ట వృధాపోకుండా కత్తిరించేది 2 వేల బొమ్మల 160 ప్లాను రు. **10.** తెలుగు పూర్తిపనికి 2 వి.పి.తో రు.19-25.
**జి.పున్నారావుచౌదరి.వెలపర్రు,తెనాలితా.**



**వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్**



రు. 250/- విలువగల 'డాలర్' 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ నెలకు రు. 25/- వంతున వాయిదాలపై చెల్లించి, పొందండి. మీ ఆర్డరుకై నేడే వ్రాయండి.

**Dollar Corporation (WAP)**
**Post Box 1011, Delhi-6.**





**'మీనా' డీజల్ ఇంజన్**
**6 H P 650 R.P.M.**

ఉత్పత్తిదారులు:—
శ్రీ తిరుమల, ఇంజనీరింగ్
కార్పొరేషన్,
191, శివాజీ ఉద్యమ నగర్,
కొల్హాపూర్, (మహారాష్ట్ర)

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా వారుఏజెంట్లు కావాలి


# తామ్రశాసనం

డెబ్భయ్యేళ్ళగా 'దేష్పాండేల ఆల్ఫొన్సోలు' ఈ ప్రాంతంలో ఎంత ప్రసిద్ధి కెక్కాయో తెలుసా? ఎందుకో తెలుసా? ఎందుకంటే, వాటి రుచే అంత, అవి అంత పుష్టికర మయినవీను!'

'పక్కగదిలో కూచుందాము రండి! సావకాశంగా మీకీ ఆల్ఫొన్సోల సంగతి చెప్తాను.' అంటూ లేచాడు బాబాసాహేబ్.

మంగేష్‌రావ్‌కి బాగా చిరాకువేసింది ఈయన మరొక కథచెప్పి ఇంకా ఆలస్యం చేస్తాడు కదా, అనుకున్నాడు. పక్కగదిలో బల్లమీద కనిపించిన లేతజీడిపప్పు, మామిడి ముక్కలు, సన్నటి అరటి వడియాలు చక్కెర పాకం పట్టిన నువ్వుగింజల పళ్లీలు ఈ చిరాకుని మరింత అధికం చేశాయి.

బాబా సాహేబ్ తన అతిథిని తినమని ఆహ్వానించాడు. మామిడి ముక్కలు నములుతూ ఆల్ఫొన్సోలకథ ప్రారంభించాడు.

మంగేష్‌రావ్ నిస్పృహతో సోఫాలో చేరగిల పడ్డాడు.

'అరె! మర్చేపోయాను సుమా...' బాబా సాహెబ్ సోఫా చేతిని బలంగా గుద్దాడు. ఇంతసేపూ అసలు విషయం తను చెప్పనే లేదుట. అది కేవలం ఉపోద్ఘాతమేనట. ఇప్పుడు అసలు సంగతేమిటో చెప్పబో తున్నాడుట.

'సెన్హోర్ ఆంతోనియో యూలియావో లామర్తీన్ ద సాంతోస్ వాలంతె పేరు విన్నారా? ముందు తరంలో గోవాలో ఈ పేరు విననివారెవరు? ప్రతివారి నోటా ఆయన పేరే! సరే, నలభయ్యేళ్ళుగా మా ఇంట్లో ఈ పోర్చుగీస్ ప్రభువు రాసిన ఉత్తరం ఒకటి ఉంది—ఆయన మంత్రివర్గ కార్యదర్శి తెలుసా? సెన్హోర్ ఆంతోనియో సాంతోస్ వాలంతెకీ మా నాన్నగారికీ మంచి స్నేహం. అతను ఆరడుగుల మనిషి కాని గోవాలో క్షయ అంటుకుంది. గోవాలో డాక్టర్లంతా అది నయం కాదన్నారు. బొంబాయి వెళ్ళినా అంతే నన్నారు. అప్పుడు పాపం ఆయనకి అభయం ఇచ్చిన మనిషెవరు? ఎవరో కాదు. దేష్పాండేలలో పెద్ద, మా నాన్నగారే! మీరేం భయ పడొద్దని ప్రతిరోజూ కార్యదర్శికి, ప్రత్యేకం దీనికోసం పెట్టిన మనిషిద్వారా ఈ ఆల్ఫొన్సోలు పంపేవారు. నమ్మండి, నమ్మక పొండి! ఆరునెలల్లో సెన్హోర్ సాంతోస్ వాలంతె మామూలు మనిషయి యూరోపియన్ క్లబ్బులో రాత్రంతా డాన్సు చేశాడు! లిస్బన్‌కి రిటైరయి వెళ్ళిపోయిన తర్వాత అక్కడినుంచి చక్కటి ఉత్తరం ఒకటి రాశాడు...అందులో, మా నాన్నని 'కారో అమీగో సెన్హోర్ దేష్పాండే' అంటూ, 'మీరు దయతో పంపించిన ఆ దివ్యమయిన ఆల్ఫొన్సోలే లేకపోతే నా జీవితశేషాన్ని స్వదేశంలో గడిపే అవకాశం కలిగేది కాదని కృతజ్ఞతతో, హృదయపూర్వకంగా మనవి చేసుకుంటున్నాను' అన్నాడు!'

బాబా సాహెబ్ ఉత్తరంలోని పోర్చుగీస్ వాక్యాలని ఆ భాషలోనే చెప్పాడు. నాగరికంగా ఉన్న అతని ఉచ్చారణ విని మంగేష్‌రావ్ ఆశ్చర్యపోయాడు. కొంచెం నవ్వుకున్నాడు.


'ఇంకా, 'మీ వాత్సల్యం వల్లనేకదా — దానికినా 'సౌదాదెస్'! ఈనాడు నేను ఇక్కడ తేజోనది తీరం మీదనే ఉన్న మా పూర్వీకుల 'షాతో'లోని ద్రాక్షతోటలో, ఈ 'సోర్టో' సేవిస్తూ, నా చిన్నకుమారై దొనా బెన్విందా గిటార్ సంగీతం వింటూ, నన్ను అనుకుని ఉన్న నా సతీమణి సెన్హోరా ఇసబెల్లా మార్గరీదా దమెనిజెస్—ఐ—సాంతూష్—వాలంతె పక్కనే ఈ కుర్చీలో కూర్చుని ఈవిధంగా విశ్రాంతి తీసుకోగ లుగుతున్నాను,' అని రాశాడు!'

సగర్వంగా, సంతోషంగా బాబాసాహెబ్ సెన్హోర్ సాంతోస్ వాలంతె ఉత్తరంలోని ఈ పంక్తులని అప్పచెప్తూ ఉండగా గుడి వద్దనుంచి డోలు శబ్దాలు వినిపించటం ప్రారంభించాయి.

అవి విన్న బాబాసాహెబ్ తన కథనం ఆపి, ఆలయంవైపు తిరిగి తలవంచి కళ్ళు మూసుకుని మంత్రాలేవో అస్పష్టంగా చదివాడు. అక్కడ రోజూజరిగే పూజవేళ బాబా సాహెబ్‌కి ఇలా మంత్రోచ్చారణ చెయ్యటం అలవాటు.

(ఇంకా ఉంది)

**Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press: 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.**



# శిలాశాసనం

వి.యస్.సుక్తాంకర్

(గత సంచిక తరువాయి)

మంగేష్ రావ్ ఈ డోలు వాద్యం విని ఉలిక్కిపడ్డాడు. సాయం సమయం త్వర త్వరగా వచ్చేస్తున్నదని, అవి అతనికి గుర్తు చేశాయి. దృఢసంకల్పంతో ఆ అవకాశాన్ని చేజిక్కించుకున్నాడు. బాబాసాహెబ్ కళ్ళు తెరవగానే సోఫామీదనుంచి లేచి తలపాగా చుట్టుకొనటం ప్రారంభించాడు. ఆ తర్వాత బాబాసాహెబ్ చేతులుపట్టుకుని క్షమార్పణ కోరేవాడి ధోరణిలో, కాని నిబ్బరంగానే ఇలా అన్నాడు: 'క్షమించండి! ఇలా మీరుచెప్పే కబుర్లని ఎంతసేపయినా సరదాగా వింటూ కూర్చోవచ్చు! కాని, నేను ఇంటికి తిరిగి వెళ్ళిపోవాలి నేను తీసుకున్న నెలరోజుల సెలవు రేపటితో అయిపోతుంది! మా ఆఫీసు అధిపతి ఒక ఇంగ్లీషువాడు. చాలా చిత్రమైన మనిషి! క్రమశిక్షణమీద ఎంతో విశ్వాసం కలవాడు—పాంజిమ్‌లో రేపు తెల్లవారే బయలుదేరే స్టీమర్ ఎక్కి ఎల్లుండి బొంబాయి చేరుకోవాలి...

బాబాసాహెబ్ ఈ కోరిక విని అదిరిపడ్డాడు. మాటలేకుండా అతని వయిపే చూస్తూ ఉండిపోయాడు. మంగేష్‌రావు మళ్ళీ ఇలా అన్నాడు: 'కాని, మీ ఇల్లు వదిలివెళ్ళేముందు మిమ్మల్ని మరొకసాయం అడగాలనుకుంటున్నాను. ఈ కొండల్లో 'దెయ్యాల అటుగది' అనే గుహ ఉందిట గదా! అందులో ఒక ప్రాచీన శిలాశాసనం ఉందిట? దానిని చూడాలి, ఖాళీ దొరకటం లేదు. నేను చరిత్ర పరిశోధనలు చేస్తూ ఉంటాను...'

'ఏమిటేమిటీ!' అన్నాడు బాబాసాహెబ్. 'ఇదా మీరుకోరేసాయం? మీ ఊరినుంచి ఆ దెయ్యాల సావిడిని చూడటానికింత దూరం వచ్చారే! ఆహా, ఏమి సాయం! మమ్మల్ని సాయంకోరేవారికి అన్నివిధాలా తోడ్పడటం మా కుటుంబ సంప్రదాయం, కాని ఇటువంటి కోరిక ఈ ఇంట్లో వినటం ఇదే మొదటిసారి! భవానీబాబా మనవడికి ఏదయినా సహాయం చెయ్యగలిగితే నాకంటే సంతోషించే వాడెవడు? ఏమి చేద్దామా అంటూ ఉవ్విళ్ళూరుతూ మీ కోరిక విందామని ఎదురుచూస్తూ వచ్చాను! భలే ఆశపెట్టారు నన్ను! ఏదో ఆస్తి అమ్మకం, దావా, పెద్ద పోర్చుగీసు అధికారులతో వ్యవహారం, మీ కుటుంబంతో కుర్రవాడికెవరికయినా ఉద్యోగం, కట్నం విషయంలో పేచీ ఏదయినావస్తే పిల్లవాడి తండ్రికి చెయ్యవలసిన సిఫారసు—ఇవేమన్నా అయిఉంటాయనుకున్నాను.. కాని గుట్టు కాస్తా బయట పడింది! చరిత్ర పరిశోధన కోసం కొండమీద గొయ్యిని చూడటానికి వచ్చారు, భేష్!' బాబాసాహెబ్ విరగబడి నవ్వాడు. 'ఏమిటి బాబూ, కొండ గుహల్లోనూ, గోతుల్లోనూకూడా చరిత్ర పరిశోధన చేస్తారా, నాకు తెలియకడుగుతాను?'

ఒక క్షణం ఆగి, బాబాసాహెబ్ తన రెండు చేతులకీ మంగేష్‌రావ్ భుజాలమీద ఉంచాడు. 'బాబూ, వినండి! పాండిత్యం అనేది మా దేశానికి రక్తంలో జీర్ణించుకుపోయి ఉంది. కాని, మాలో ఎవరూ ఆ దిక్కుమాలిన దెయ్యాల గదికి వెళ్ళలేదే! అక్కడ సాధారణంగా గొడ్లు కాసేవాళ్లు వెళ్లి మధ్యాహ్నం పూట భోజనానికీ, కునుకు తియ్యటానికీ వాడుతూ ఉంటారు. కొండల్లో కుక్కగొడుగులు ఏరినట్లు చరిత్ర విశేషాలు ఏరుకోవచ్చునని మాకు తెలీదా?' అన్నాడు అనునయస్వరంలో

ఈ విధంగా తన అతిథి పథకాన్ని తోసిపారవేసి, బాబాసాహెబ్ మంగేష్‌రావ్‌ని ఒక్కవారం కాకపోయినా కనీసం నాలుగు రోజులయినా ఉండి ఊరి సంత చూసి వెళ్లమన్నాడు: ఇది ఏటా జరిగే పెద్ద విశేషం, చుట్టుపక్కల ఊళ్లజనం అంతా పోగవుతారు అని నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు.

కాని, మంగేష్‌రావ్‌కి అప్పటికి బాబాసాహెబ్ అనుగ్రహాన్ని ఎదిరించే శక్తి వచ్చింది. ఏమయినాసరే కొండగుహ చూడవలసిందే అనుకున్నట్లు బొంబాయికి వెళ్లవలసిందే అని పట్టుపట్టాడు.

ఇక మంగేష్‌రావ్‌ని మొహమాట పెట్టి లాభంలేదని బాబాసాహెబ్ గ్రహించాడు. ఆ పాడు 'ఇంగ్లైజ్' అధికారిని తనివితీరా తిట్టుకున్నాడు. తర్వాత శానోతో అతిథికి టీ తయారుచేసి అతన్ని కొండగుహకి తీసుకువెళ్లేందుకు తోడు పిలుచుకురమ్మన్నాడు. అటునుంచి అటే రహదారికి తీసుకువెళ్లే ఏర్పాటు చెయ్యమన్నాడు.

అయితే టీ ఆఖరిది కాబట్టి—అంత త్వరగా ముగియలేదు. సూర్యకిరణాలు కొబ్బరిచెట్లమీద వాలుగా పడేదాకా సాగింది. చివరికి కొందరు పనివారు కొబ్బరిమట్టల కాగడాలతో హరికేనులాంతర్లతో కర్రలతో సిద్ధమయ్యేసరికి మంగేష్‌రావ్ తెరిపిగా ఊపిరి పీల్చుకున్నాడు

ఇల్లువదిలి బయటికి రాబోతూ ఉండగా పెద్ద గొడవ ఏదో బయలుదేరింది. సుమారు ఇరవయిమంది, బాబాసాహెబ్ పనిమనుష్యులూ, ఘూర్‌భయ్యాలూ ఇంటివాకిలివద్ద గుమిగూడారు. అందులో కొందరికి బాగా గాయాలు తగిలి రక్తం కారుతోంది. బాధతో మూలుగుతూ, తమ సహచరుల సాయంతో నడుస్తున్నారు. వాళ్ళు దగ్గరే ఉన్న కొబ్బరితోపు వయిపు కోపంగా చూస్తూ పిడికిళ్లు బిగించి తిట్టుకుంటున్నారు.

అంతదాకా సౌమ్యంగా ఉన్న బాబాసాహెబ్ మొహం అమాంతం కోపంతో ఎర్రబడింది, బొమలు ముడిపడ్డాయి.

అందరూ లోపలికి వచ్చారు. వెక్కిళ్ల మధ్య జరిగిన కథనంతా వివరంగా చెప్పారు. విరోధులతో యుద్ధం, రావ్‌సాహెబ్ ముఠా దౌర్జన్యం, వారివద్ద తాము పొందిన పరాజయం

బాబాసాహెబ్ చెప్పినట్లు ఆయన పనిమనుష్యులు కొందరు కొబ్బరితోటలో నుయ్యి తవ్వుతున్నారట. ఘూర్‌భయ్యాలు వారికి కాపలా ఉన్నప్పటికీ అవతల వయిపు పఠానులు కొందరు వచ్చి నుయ్యి తవ్వరాదని ఆజ్ఞాపించారు. మాటలు పెరిగి దెబ్బలాటకి దారి తీశాయి. జరిగిన పోట్లాటలో బాబాసాహెబ్ వర్గం ఓడిపోయింది.

ఇది ఎన్నో వరలతో అక్కడ పోగయిన వారు చెప్పిన కథ సారాంశం. చివరికి వారిలో ఒకడు ఒక చిలుముపట్టిన రాగిరేకు ముక్కే చూపించి, 'అయ్యగారూ, ఈ రేకుముక్కే మన సాక్ష్యం! దానికెంత నెత్తురుందో చూడండి! తవ్వుతూంటే ఇది దొరికింది. గొయ్యి పక్కనే పెట్టి మా పని మేము చేసుకుంటూ ఉంటే పఠాన్ ఒకడు వచ్చి దాంతో మా తల మీద బాదాడు! మా ప్రాణాలు రక్షించుకునే హక్కు మా కుందిగదా?' అన్నాడు.

మళ్ళీ తన ప్రయాణం వెనుకబడింది కదా అని మంగేష్‌రావ్ విసుక్కున్నాడు. బాబాసాహెబ్ పనిమనుష్యులని చూస్తే జాలి కూడా వేసింది కాని, ఇంతలో రాగిరేకు చూడగానే అదేమిటో తెలుసుకుందామనే కౌతుకం అతనిలో కలిగింది. ముందుకి వచ్చి ఆ రేకు ముక్కని తీసుకున్నాడు.

మంగేష్‌రావ్ కూడా తమ వయిపే ఉన్నాడు కనుకనే ఇంత ఆసక్తి చూపుతున్నాడనుకున్నాడు బాబాసాహెబ్. 'చూశారా వాళ్ల దౌర్జన్యం!' అన్నాడు. అంతటితో ఊరుకోక వాళ్ల దౌర్జన్యాల వివరాలు కొన్ని చెప్పాడు. 'ఇంకా ఊరుకుంటానా? దీని సంగతేమిటో తేల్చేస్తాను! రేపే ఈ రేకు ముక్కని కోర్టులో దాఖలుచేసి దావా వేస్తాను.'

మంగేష్‌రావ్ అతని మాటలు వింటున్నట్లే ఉన్నా నిజానికి ఆ రాగిరేకుని పరీక్షించటంలో మునిగిపోయాడు. కొంతసేపు తర్వాత దానిని బాబాసాహెబ్‌కి తిరిగి ఇచ్చేశాడు. జరిగినదానికి తన సానుభూతి తెలిపాడు. బాబాసాహెబ్ కూడా తన పనిమనుష్యులకి ధైర్యం చెప్పాడు. కోర్టుద్వారా ప్రతిపక్షంవారికి తగిన శాస్తి చెయిస్తానన్నాడు. బాగా దెబ్బలు తగిలినవారిని చికిత్సకని పక్కనే ఉన్న బస్తీకి పంపించాడు.

ఇంటి ఆవరణలో సంచలనం పూర్తిగా తగ్గిపోయింది. అప్పటికే ప్రొద్దుగుంకుతున్నది కాబట్టి, ఇక గుహకివెళ్లి లాభం లేదనుకున్నాడు మంగేష్‌రావ్. వచ్చినపని కాలేదే అని నిరాశచెందాడు. బాబాసాహెబ్ అతనికి కలిగిన ఇబ్బందికి ఎంతగానో నొచ్చుకున్నాడు. సేవకులతో అతిథిని జాగ్రత్తగా రహదారి తీసుకొని పొమ్మనిచెప్పాడు. మంగేష్‌రావ్ వెళ్లిపోయేముందు ఒక చిత్రమయిన పనిచేశాడు. తన సంచిలోనుంచి ఒక సిరాసీసా, కాగితం ముక్కా తీశాడు. సిరాని రేకుమీద రాసి కాగితం మీద అచ్చువేశాడు.

'ఇది ఏదో వట్టి రాగి రేకు కాదు బాబాసాహెబ్‌గారూ,' అన్నాడు

'ఇది ఒక ప్రాచీన తామ్రశాసనం! ఈ సంస్కృత శాసనంద్వారా మనకి ఏమేమి కొత్త విషయాలు తెలుస్తాయో! అందుకనే, మీ వ్యవహారం ముగియగానే దాన్ని బొంబాయికి, నాకు పంపించగోరుతున్నాను.'

ఈ కోరిక బాబాసాహెబ్‌కి నవ్వు తెప్పించింది. తన ఆందోళన మరిచిపోయి అతిథిని కవుగలించుకుని, మళ్ళీ త్వరలో తన ఆతిథ్యం స్వీకరించాలని మరోకసారి హెచ్చరించి సెలవు తీసుకున్నాడు. పనిమనుష్యులతో, 'ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. కంసాలి ఇంటివెనక గట్టు వెంబడే అడ్డదారిని తీసుకువెళ్లండి ఈయన్ని. 'హాత్‌పాటలాంబా' పొలందాటి పెద్ద రోడ్డుమీదకి వెళ్లిపొండి,' అని చెప్పాడు.

పొలంలోనికి ప్రవేశించగానే మంగేష్‌రావ్ తనకి తోడుగా వచ్చినవారితో, 'ఇదేనా హాత్‌పాటలాంబా పొలం?' అని అడిగాడు.

'అవును బాబూ,' అని వెంటనే జవాబిచ్చాడు లాంతరు పట్టుకుని నడుస్తున్న ఒక

యువకుడు. బొంబాయినుంచి వచ్చిన ఈ అతిథితో మొదట తనే మాట్లాడే అవకాశం కలిగినందుకు అతనికి గర్వం వేసింది. 'ఇదేనండి, హాత్‌పాటలాయీ పొలం! ఈ చెట్టుకాడనుంచి, ఆ గట్టుదాకా ఈ పొలమే – పొలుకి రెండు పంటలిస్తుంది! జగూపాసంత్‌ది కాని రెండేళ్ళగా తాకట్టులో ఉండిపోయింది. అసలు వడ్డీకూడా ఇవ్వలేక పోయాడంట!'

'నోరుముయ్యరా క్షురవేధవా!' అని కోప్పడ్డాడు ఆ జట్టులోకెల్లా వృద్ధుడు, తనకన్నా ముందు ఈ చిన్నవాడు అతిథితో మాట కలిపినందుకు. 'నీకు తెలీని విషయాలు మాట్లాడకబోతే నీ తలేం తీస్తారా? నువ్వు చెప్పిన ఒక్కమాట కర్థం ఉందా? హాత్‌పాటలాయీ పొలం ఇంకా రానేలేదు! అక్కడే గదట్రా ఆ బాపనావిడ తన బంగారు 'పత్లీ' (కంకణం) పోగొట్టుకుంది! ఇంకా బుద్ధిలేకుండా ఈ పొలం తాకట్టులో ఉందని కూస్తావా? జగూపాసంత్ తన బాకీలన్నీ చెల్లించుకుని షావుకారు దగ్గర పొలాన్ని విడిపించుకుని ఇప్పటికి ఆరునెలలు కాలేదూ? పోయిన దసరాలోనే గదట్రా?' అతను ఈ ధోరణిలో ఇంకా కోప్పడేవాడేమోగాని మంగేష్‌రావ్ కుతూహలంతో, 'బ్రాహ్మణావిడ ఎవరూ? ఆవిడ పోగొట్టుకున్న కంకణానికీ, ఈ పొలానికీ సంబంధం ఏమిటీ?' అని అడిగాడు.

'చెప్తమంటరా బాబూ!' అని ప్రారంభించాడు వృద్ధుడు, సంభాషణ అతిథికి తగిన స్థాయిలో నడుస్తున్నదన్న సంతోషంతో — మంగేష్‌రావ్ పండితవర్గం కాబట్టి. 'శానదినాలముందు - ఎంతముందో మనకి తెలీదు!—ఒక బాపనావిడ తన బంగారు గాజుని ఈ పొలంలో పోగొట్టుకుందిట. ఇది శానా పాతకద అని సెప్పాను కదూ! మా తాత ముత్తాతల కాణ్ణుంచి వాత్తోంది దయ్యా! ఈ బాపనావిడ గుళ్లో శాస్త్రుల్లగారి భార్య. పతిరోజూ సీకటితోటే – కోడి కూసేముందే! — లేచివచ్చి పొలంలో గరికపోసలు కోసుకుపోయేది మొగుడి పూజలకోసం! ఇది ఆమె కేఁవాటు బాబయా. కానయితే ఆ దినం దేవుడాజ్నే యేమోఆ బాపనావిడ–'

'—పాటలీ ఈ పొ లం సివరేపోయే కాలవలో పడిపోయింది!' అతిథితో మాట్లాడే హక్కు ఒక్క ఆ వృద్ధుడికే ఎందుకు ఉండాలి, అన్నట్లు మరొక సేవకుడు వెంటనే సమాధానం చెప్పాడు. 'పాపం ఆవిడేం చేస్తుందీ? కళ్ళు వాచేట్లు ఏడిచింది...'

ఈ జట్టుతోనే వస్తున్న శానో ఇదంతా సహించలేకపోయాడు. తమ యజమాని ప్రియసేవకుడు తనే కాబట్టి మొహం చిట్లిస్తూ కర్రతో నేలమీద కొట్టాడు. 'ఈ వెర్రి మొహాలకి కథ చెప్పటమే రాదు బాబూ: మా అయ్యగారినోట వినుండాలి మీరు! అవును బాబూ ఆయన బలే చెప్తారు!' ఈ విధంగా తన యజమాని ప్రశంస ముగించి ఇంకా ఇలా చెప్పుకుపోయాడు 'పాపం, ఆ బాపనావిడ అమ్మవారిని ప్రార్థించింది. ఆ రోజుల్లో నమ్మకాలలా ఉండేవి బాబూ! దేవుళ్లు కూడా మనం ప్రార్థిస్తే పలికేవారు బాబూ! ఆమె మొర విన్న అమ్మవారు ప్రత్యక్షం అయి భక్తురాలిని దగ్గరికి తీసుకుంది. 'అమ్మాయి ఏడవకు! అదుగో నీ పత్లీ! తీసుకో!' అంది. పాపం ఆ బాపనావిడ నీటి దగ్గరికి పరిగెత్తుకెళ్ళి చూసింది. ఏముందీ, పత్లీ నీటిమీద తేలుతోంది! దాన్ని తీసుకుని అమ్మవారి కాళ్లమీద పడదామని తిరిగిచూసింది. అమ్మవారు మాయమయిపోయారు!'

గుక్క తిప్పుకోకుండా చెప్పుకుపోయిన శానో ఊపిరి పీల్చుకుందామని ఆగాడు తన యజమానిలాగే కథని చక్కగా ముగించాలని అనుకున్నాడు అదొక పొరపాటయిపోయింది. ఇందాకటి ముసలివాడు వెంటనే కలగచేసుకున్నాడు.

'అవును బాబూ! శానో చెప్పిందినిజమే' అని శానోని పొగడి జాగ్రత్తపడ్డాడు. శానో ఎంత కాదన్నా యజమానికి ప్రియపరిచారకుడు 'జగదంబ పాపం ఆ పూజారి భార్య పత్లీ తిరిగి ఇప్పించింది! అది గొప్ప అద్భుతం! అప్పటినుంచీ ఈ పొలం హాత్‌పాటలాయీ అయిపోయింది. మా ఊరి అమ్మవారికి కూడా కొత్త పేరు పెట్టారు, అని ఎడమవయిపున కనిపించే గుడిని చూపించాడు. ఒకసారి వంగి నమస్కరించి,'అదుగో బాబూ అదే అమ్మవారి గుడి—హాత్‌పాటలాయీ దేవి ఆలయం,' అన్నాడు.

బాబసాహెబ్ పంపిన పనిమనుష్యుల మధ్య ఈ పోటీ మంగేష్‌రావ్‌కి ఎంతో ఉపకరించింది. అసలు కథని క్లుప్తంగా వినగలిగాడు.

'ఇదన్నమాట కథ! బావుంది.' అన్నాడు. నిశ్శబ్దంగా కొన్ని అడుగులు వేశాడు.' అవును! 'హాత్' అంటే చెయ్యి! 'పత్లీ' అంటే చేతి కంకణం! ఆ బ్రాహ్మణ స్త్రీ ఇక్కడ తన 'హాత్‌పత్లీ' పోగొట్టుకుంది! ఈ మాటలకి 'ఆయీ' అంటే తల్లి అనే మాట చేరిస్తే 'హాత్‌పాటలాయి' అవుతుంది! అంతేగా! చక్కటి పేరు, 'హాత్‌పాటలాయీ' అని తనలోతనే అనుకున్నాడు.

అతిథి తమ కథపట్ల చూపిన శ్రద్ధాసక్తులకి తోడువచ్చినవారంతా ఉబ్బిపోయారు. 'అంతే బాబూ! మీరు చెప్పిందంతా నిజం!' అన్నారు. అప్పటికి వారు ఆలయం సమీపించారు. అక్కడ పెద్ద గుంపు పోగయి ఉంది ఆ గుంపులో చాలామంది సాయుధులయి ఉన్నారు. వారి చేతుల్లో గొడ్డళ్లు, ఈటెలు, తుపాకులు ఉన్నాయి ఈ అపూర్వదృశ్యం చూసి మంగేష్‌రావ్ చాలా ఆశ్చర్య పోయాడు. త్వరగా తిరిగి వెళ్లిపోదామనుకుంటున్నప్పటికీ ఒకసారి ఆగి సంగతి ఏమిటో కనుక్కుని వెడదామనుకున్నాడు. అక్కడివారు కొందరు కాగడాలు వెలిగిస్తున్నారు. మరి కొందరు ఏదో విషయం చర్చిస్తున్నారు. మంగేష్‌రావ్ ఎవరిని ఏమి అడుగుదామా అనుకుంటూ ఉండగా అతనికి ఒక సుపరిచితమయిన కంఠస్వరం వినిపించింది. 'అయ్యా, అప్పుడే వెళ్లిపోతున్నారా? వచ్చిందినమే తిరిగిపోతున్నారా! మా యజమాని ఇంటో ఇటువంటిదెప్పుడూ జరగలేదే!'

పొద్దున మర్రిచెట్టుమీద కనిపించిన వృద్ధుడు మంగేష్‌రావ్ ముందు వచ్చి వినయంగా నిలబడ్డాడు.

'ఏమిటన్నా ఇదంతా?' అని అడిగాడు మంగేష్‌రావ్ చిరునవ్వుతో.

'అంతా కర్మబాబూ, కర్మ! ఇంకేం సెప్పను?' అన్నాడు వృద్ధుడు ముఖం చిట్లిస్తూ. 'మా ఈ కష్టాలకి 'దేవ్‌పాన!' ఇంతలో మంగేష్‌రావ్‌కి తను చెప్పేది అర్థం కాకపోవచ్చునని గ్రహించి, 'గత అయిదేళ్లగా ఏవేవో గింజలు తిని బతుకు

# తామ్రశాసనం

ఉన్నాం బాబూ! ఇప్పుడసలుకూడా లేవు... మేమూ, మా గొడ్డూ బతుకుతామా, చస్తామా అన్నట్టుంది! ఈ ఏడయినా మా పెదకామందులు తమ కొట్లాట మానారేమో అనుకున్నాం కాని అంతా చెడిపోయింది. పక్క పల్లెల్లో దున్నటం కూడా పూర్తవుతాంది, ఇక్కడ మాటో? పొలాల నిండా నడుంలోతు ఉప్పునీరాయె! మాకు యేరే గతిలేదు బాబూ — ఊరొదిలి వలస పోవల్సిందే! ఈ పొలాలల్లో మా రగతం, శోడ్చి పనిసేసేము. వీటిని వదిలిపోవాల! మాలో కొందరు పంజాబ్‌లో రోడ్డు కూలీలుగా పోతామంటున్నారు, తక్కినవాళ్లు మార్ముగావ్‌లో పోర్టరు కూలి సేస్తామంటున్నరు! మిగతావాళ్లంతా అడుక్కు తినాల్సిందేగద? ఆ బతుకుకంటే సావటం మేలు!'

వృద్ధుడు విచారంతో కుంగిపోయాడు. 'అయితే బాబూ, ఊరొదిలి పొయ్యేముందు మా గ్రామదేవతకి మొక్కుకునిపోతాం. ఈ మొక్కుబడి పాతపాటలలాయె తల్లికే! ఆ తల్లి మా మొర ఇని మేమెక్కడికెళ్ళినా మమ్మల్ని కాపాడుతాంది. ఇంతదాకా శకునాలన్నీ బాగనే ఉండయి. మొన్న మా వాళ్లు వేటకెళ్ళి వచ్చారు. ఇంతకి ముందెప్పుడూ అంత దొరకలేదు వాళ్లకి! అంటేకాదండి — రోజులెంబడి అడవుల్లో తిరిగినా అమ్మవారికి ఇమ్మకుసేందుకు ఒక జంతువు కూడా పడేదికాదు! మీకు తెలిసే ఉంటుంది బాబూ — మీ దేశంలోనూ అంతేననుకుంటా — అమ్మవారికి తగిన జంతువు కానుక ఇస్తే ఆ యమ్మ మా మొర ఇనుకుని, గణాచారి మూలకంగా ఆన సెబుతాది. అవును బాబూ, శకునాలన్నీ బాగనే ఉన్నాయి! మా తాత కాలంలో ఇక్కడ ఏనుగుల మందలు తిరిగేవిట బాబూ, ఏనుగుల మందలు! మా తాతే సెప్పేడు. ఇప్పుడవన్నీ లేవు! కాని వేట కెళిన కుర్రాళ్లు నాలుగు అడివి పందులు, జింక దుప్పులు, ఎన్నో చెవుల పిల్లుల్తో తిరిగొచ్చినారు! అబ్బ ఈ మద్దిన ఇటువంటి ఇంత ఇన్నామా?'

ఇంతలో గుడి దగ్గిర ఎవరో ప్రార్థన మొదలు పెట్టబోతున్నారని అరిచాడు.

'అంతే బాబూ, శకునాలన్నీ బాగా ఉండాయి! అమ్మవారు దయ జూపిస్తారని నా కెందుకో అనిపిస్తావుంది! సహజంగా ఈ గ్రామం వొదిలి పోతాం. ఈ ముసిలివోడి మీద దయుంచండి బాబూ,' అంటూ వెళ్ళిపోయాడు వృద్ధుడు.

మంగేష్‌రావ్ మర్యాదగా ఏదో జవాబు చెప్పి చివరిసారిగా గుంపు వయిపు చూసి ప్రయాణం కొనసాగించాడు.

* * *

'దేవ్‌పాన్' అయి రెండువారాలే అయింది. కాని, గ్రామం పూర్తిగా మారిపోయింది. హఠాత్తుగా, దాని పూర్వపు కళ పోయి నిర్జీవంగా కనిపిస్తోంది కట్టు తెగిన అయిదేళ్లలో ఇంత కళావిహీనంగా ఎప్పుడూ లేదు. చిన్న ఇళ్ళచుట్టూ వేసే కూరగాయల తోటలు లేవు; మామిడి, పనస చెట్లమీద కాయలులేవు; పశువుల, మేకల, కోళ్ళ, కుక్కల ధ్వనులతో హడావుడిగా ఉండె ఊరు సద్దు మణిగిఉంది. సాధారణంగా కనిపించే ఎండుగడ్డి, పేడనుద్దలు, వెదురు బొంగులు, తాటాకు, కొబ్బరి మట్టలు ఏవీలేవు. కుమ్మరిచక్రం తిరగటం మానివేసింది. కమ్మరి కొలిమిలో నిప్పులేదు. మగ్గాలు కదలటం లేదు వీధుల వెంబడి తిరిగే రయితులే లేరు. అసలు, నదివడ్డుమీద, కొండచరియలమీద నరసంచారమే లేదా అనిపించేట్లు ఉంది. గ్రామం అంతా నిర్మానుష్యంగా కనిపిస్తోంది.

పక్షం రోజులక్రితం జరిగిన దేవ్‌పాన్ తర్వాత తమ గ్రామదేవత ఆశీర్వాదంతో జట్లు జట్లుగా జనం ఊరువదిలి వెళ్ళిపోయారు. ఇంతకి ముందు ఆ ఊరు జనానికి లక్ష్మీకటాక్షం కొద్దోగొప్పో ఉండేది. తిండీ, గుడ్డా విరివిగా దొరక్కపోయినా వళ్ళువంచి తమ పొట్ట నింపుకునేవారు. ఈనాడు లక్ష్మీదేవి వారిని చిన్నచూపు చూస్తున్నట్లుంది. చివరి జట్టు కూడా వెళ్ళిపోతోంది. ఒక వందమంది తమ గొడ్లనీ, ఇతర చరాస్తినీ పక్క ఊళ్ళవారికి అమ్ముకుని మిగిలిన కొద్ది సామానుతో బయలుదేరుతున్నారు. కొన్ని కుండలు, చింకి గుడ్డల మూటలు—ఇక వారికి మిగిలినవి. చిక్కిపోయి, ఎముకల గూళ్ళు కనిపిస్తున్న వారి కుక్కలు మాత్రం తమ యజమానుల భావిజీవితాన్ని పంచుకొనటానికి వారి వెంటనే వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాయి.

బాబా సాహెబ్‌గారి ఈ రయితులందరూ ఆయన ఇంటి ఆవరణలో నుంచుని కంట తడిపెట్టుకున్నారు.

'బాబూ, మీ దయమూలకంగా ఇన్ని రోజులు మీ నేల సాగుబడి చేసి బతికాం,' అన్నారు. 'కాని, మీ రచ్చన వొదులుకుని పోవాలని మాకు రాసుంది. ఈ బీద రయితుల్ని మరవకండి బాబూ! ఏ నాటికయినా, మంచి రోజులొస్తే, మళ్ళీ మీ కాళ్ల దగ్గిరే పడుంటాం! ఇంకెక్కడి కెల్లగలం? మేమెక్కడున్నా మీకూ, మీ పిల్లలకీ మంచి కలగాలనే జగమంతుడికి మొక్కుకుంటూ ఉంటాం...'

వారు ఈ విధంగా సెలవు తీసుకొనటంతో బాబాసాహెబ్ జాలిగుండె తేలికగా కరిగిపోయింది. 'వెళ్ళకండి! రావ్ సాహెబ్‌తో రాజీ చేసుకుంటాను!' అందామనిపించింది. కాని, ఏటి అవతల తన చుట్టాల ఇల్లు చూడగానే ప్రతీకారవాంఛ మళ్ళీ పెరిగి, ఆ మాటలు నోటి వెనకనే ఆగిపోయాయి. ఏది ఎలా ఉన్నా, ఈ సంఘటన అతనికి ఎంతో విచారం, కలవరపాటు కలిగించింది.

బాబాసాహెబ్ ఇంటి నుంచి రయితులు రావ్ సాహెబ్ ఇంటికి వెళ్లి అతని వద్ద సెలవు పుచ్చుకున్నారు.

వారి దారి చెరువు కట్ట వెంబడే ఉంది. ఈ కట్ట ద్వారానే వారు తరతరాలుగా తమ ఖజన్ని సాగుబడి చేసుకున్నారు. నడుస్తూ ఉన్న వారి అడుగులు బరువెక్కిపోయాయి. కొందరికి కన్నీరు ఆగనే లేదు 'తల్లి వంటి ఈ భూమిని వదిలి వెళ్ళిపోతున్నామే' అన్న బాధ అందరిలోనూ మెలగింది. కట్ట చివరికి వచ్చేశారు. ఆఖరిసారిగా తమ ఊరు వయిపు చూశారు. ఇక రహదారి మీదకి వెళ్లే ముందు వారిలో ఒకతను,' సూడు, సూడు! ఆ తపేలా బంట్రోతు దిక్కుమాలిన కొడుకు నీటిలోకి జారి పడ్డట్టున్నాడు!' అన్నాడు.

ఆ చిన్న పిల్లవాడు నీటిలో నుంచి బయటపడి కట్ట ఎక్కి చూస్తూ ఉంటే అందరూ అలాగే చూస్తూ నిలబడిపోయారు. ఆ పిల్లవాడు తన హడావుడిలో ఉత్తరాల సంచీ నీటిలో వదిలివేసి వెళ్ళిపోయాడు అక్కడి నుంచి.

'మ్యాడ్లా అడికెంత పొగరో! అని

జ్వాగా, అప్పు టాం సంచీ నీటిలో పడింది, అప్పు అలాగైనే ఏదు!' అని అరిచాడు ఒక వృద్ధుడు. 'ఒరే — యస్వియా, నువ్వు! తిన్నియా!—ఇంకా చూస్తావేంరా? మన బాబాసాహెబ్ గారి ఉత్తరాలేమయినా ఉంటయేమో! అయ్యాక్కాక మరెవ్వరికి? ఆ ముగ్గవేధవ ఇంటికి దివ్వుడు తీశాడు మరి!'

వృద్ధుడు మాట్లాడటం ముగించే ముందే ఒక యువకుడు నీటిలోకి గెంతి చేరి వెళ్ళిపోతున్న సంచీని ఈదుకుంటూ వెళ్ళాడు.

గ్రామంలో తపాలాఫీసు లేదు. అది అక్కడికి పదిమైళ్ళ దూరంలో ఉంది. ఇప్పటికి కొన్ని సంవత్సరాలుగా ఉత్తరాలు ఒక ముసలి తపాలా బంట్రోతు తీసుకువస్తున్నాడు. అతను రిటైరయ్యే కాలంకూడా అతి సమీపంలో ఉంది. అతనికి అసలు పెద్ద పనిలేదు. ఈ ఉద్యోగం దొరకటమే అదృష్టం. అనకి ఇష్టం వచ్చినరోజున వచ్చిన ఉత్తరాల కట్టని బాబాసాహెబ్‌గారి ఇంటి వసారాలోనో, రావ్ సాహెబ్‌గారి ఇంటి వసారాలోనో టపాని పడవేసిపోవటమే అతని పని. ఆ ఊరిలో వీరిద్దరికి తప్ప మరెవరికి వస్తాయి లేఖలు? ఒకవేళ వచ్చినా ఆ గ్రామంలో చదవటం అనేది ఎవరికి వచ్చు? ఎలాగూ చదివించటానికి తమ కామందుల దగ్గరకే తీసుకుపోవాలి కదా? అందుకనే, గ్రామస్తులు ఎప్పుడయినా ఒకసారి తమ యజమానుల ఇళ్ళకివెళ్ళి తమ కేమయినా ఉత్తరాలు వచ్చాయేమో కనుక్కుంటూ ఉండేవారు. ఈ మధ్య, వృద్ధాప్యంవల్ల పోస్ట్‌మాన్ సంచీ కొడుకుచేత తెప్పిస్తూ ఉండేవాడు. వాడికి తొమ్మిదేళ్ళు రావొచ్చాయి, అప్పటికే గొడ్లు కాయటం కూడా ప్రారంభించాడు.


నీటిలో దూకిన కుర్రవాడు త్వరలోనే సంచీని చేజిక్కించుకున్నాడు. దానిని తుడిచి 'వీరా రేడుతూ ఉండండి! ఈ ఉత్తరాలని బాబుగారి కిచ్చేసొస్తాను' అన్నాడు. పాత సంబంధం తెగిపోయినా బాబాసాహెబ్‌పట్ల గౌరవం మాత్రం తగ్గలేదు ఈ యువకుడికి.

బాబాసాహెబ్ వెళ్ళిపోతున్న గుంపునే ఇంకా చూస్తూ నుంచునిఉన్నాడు. వారి వలస అతనికి ఎంతో బాధ కలిగించింది. అప్పుడప్పుడు పాడుగా ఉన్న వాడనయిన చూసి నిర్మానుష్యంగా కనిపించే వానిని చూసి మరింత బాధపడేవాడు. 'మా పోట్లాటల వల్ల ఈ పేదరయితుల కింత కష్టం వచ్చింది! పాపం ఇందులో వారి తప్పేముంది? అయిదేళ్ళగా యమయాతన అనుభవించారు. పొట్ట నింపుకొనటానికని ఇప్పుడు తమ ఇళ్ళు వదులుకుని దూరదేశాలు వెళ్ళిపోతున్నారు. వీరి కష్టాలకంతా మేమే కారణం! ఈ పెద్ద ఇళ్ళు, ఆస్తులు వారి శ్రమద్వారానే కదా వచ్చాయి మాకు? పాపం చిన్న కూలికోసం తరతరాలుగా కష్టపడి మా గాదెలు నింపారు! నేడు మేము సుఖపడుతున్నామంటే వారి మూలంగానే! వారి శ్రమే ఈ గ్రామం పంటల కీర్తిని ఇంత చేసింది! అయినా వారు సాగుబడి చేసే భూమిమీద వారికే హక్కులేదు! దేవుడీ అన్యాయాన్ని సహిస్తాడా? వారికి రావలసింది వారికి రాకుండా చెయ్యటం, రాక్షసకృత్యం కాదా? ఇది సరి అని వప్పుకుంటాడా?' అనుకున్నాడు. ఇంతలో తపాలా సంచీ తెచ్చిన యువకుడు అతనికి నమస్కారంచేసి, పోస్ట్‌మాన్ కొడుకు ఏవిధంగా సంచీ జారవిడచాడో అది తనెలా తీసుకువచ్చాడో చెప్పి సంచీ ఇచ్చాడు. అతని విశ్వాసం బాబాసాహెబ్‌ని బాగా కదిల్చివేసింది. 'మధ్యాహ్న వేళయింది, కాస్త పుచ్చుకునిపో!' అన్నాడు ఆదరంగా.

తర్వాత పోస్ట్‌మాన్ కొడుకు పోమరితనాన్ని కాస్త తిట్టి ఉత్తరాలని పరిశీలించటం ప్రారంభించాడు. అందులో ఒకటి బ్రిటిష్ ఇండియానుంచి వచ్చింది. ఆ రోజుల్లో గోవాకి బయటనుంచి ఎక్కువ ఉత్తరాలు వచ్చేవికావు. ముందు దానివిచించుతూ, 'హోహో', ఇది మన బొంబాయి స్నేహితుడిదగ్గర్నుంచి, అని చిరునవ్వు నవ్వుకున్నాడు. కుతూహలంగా చదవటం ప్రారంభించిన అతని ముఖంమీద చిరునవ్వు క్రమంగా మాయమయి, గాంభీర్యం తొణికిసలాడింది.

మామూలు కుశల ప్రశ్నలు, కృతజ్ఞత తర్వాత మంగేష్‌రావ్ ఇలా రాశాడు.

'మీ పొలంలో దొరికిన తామ్రశాసనం అమూల్యమయినదని తెలుపటానికి సంతోషంగా ఉంది అది కాదంబకులానికి సంబంధించిన శాసనం. ప్రారంభంలో కొన్ని పంక్తులు, మధ్యలోనివీ కొన్ని సరిగా చదవ



దేహపుష్టికి - ఆరోగ్యానికి
కుండిత-డి గోపాలాచార్యులవారి
69 సంవత్సరములనుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేటు లిమిటెడ్
మదరాసు 17

ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్
లైసెన్స్ అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రయాణాలు, యాత్రలు, నాటకములకు ప్రశస్తమైనది
ఆటోమేటిక్ 50 షాట్లు ఏర్పాటుగలదు తెలికైనది ఇందు నుండి వెలువడు నిప్పు రవ్వలు మిమ్మును కాపాడును. ధర 50


షాట్లు నెం 33 రు 13/50. ఖర్మన్ మోడల్ నెం 99 రు. 15/50 వి.పి.పి. చార్జీలు రు. 2/50 లెదర్ కేస్ రు 7/- అదనపు షాట్లు 100కి రు 5/-
GEM ARTS (WAPM 15)
P. Box 1325, Delhi 6



మడమ పగుళ్ళు?

లిటెన్సా
వాడండి
DZ1613ATG

# తామ్రశాసనం

టానికి వీలులేకపోయింది కాని శాసనం మొత్తం అర్థం తేలికగా గ్రహించవచ్చు సంస్కృతమూలంతోబాటు అనువాదంకూడా పంపుతున్నాను — చిరిగిపోయిన పంక్తులు మినహాయించి.

'మాది పండితవంశం అన్న సంగతి అందరికీ తెలుసు. ఈ శాసనంలోని వస్తువుని నేడు మా గ్రామంలో హాత్‌పాటలాయీ కథ గురించి చెప్పుకునే కథతో పోల్చి చూడగలరు! కొన్ని దశాబ్దాలముందరే మా ఊరిచుట్టూ ఏనుగుల మందలు తిరుగుతూ ఉండేవిట అందుచేత బ్రాహ్మణస్త్రీ హాత్‌పత్తి కథ ఒక చక్కని కట్టుకథ అని గ్రహించవచ్చు! దేవి పేరు 'హాత్‌పత్తీ' నుంచి కాక 'హస్తినీపట్టన్' (ఏనుగుల ఊరు) నుంచి వచ్చిఉంటుంది. నేడు మా ఊరు ఉన్నచోట ఒక కాదంబరాజా హస్తినీ పట్నం' కట్టించి ఉంటాడు.

'ఈ తామ్రశాసనం దొరకటం నిజంగా దైవకృపే అంటాను నేను. శతాబ్దాలు భూగర్భంలో దాగిఉన్న ఈ తామ్రశాసనం సరిగ్గా మా ఖాజన్ గురించిన వివాదం సమయంలో దొరకటం కేవలం దైవేచ్ఛ వల్లనే అనిపిస్తోంది నాకు! ఈ వివాదం వల్ల శ్రద్ధాభక్తులతో ఎంతకాలంగానో ఈ భూమిని సాగుబడిచేసిన మా రైతులు ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు కాబట్టి వేరే ఏదీ రాయనవసరం లేదనుకుంటాను...'

బాబాసాహెబ్ ఆతృతతో శాసనం సంస్కృత పాఠం చదవటం ప్రారంభించాడు.

జాతః శ్రీనరవర్మేతి కర్తైరానందయుం జగత్॥ యశ్శాలు క్యంనిజేరాజ్యేఽ స్థాపయ ద్విజితాలుపః॥ కదంబితకదంబోఽలం క్వతార్థీ కృతాస్ప్రభుః॥ శౌర్యశ్రీ పరిరంభ విశ్రమభుజోదన్డః ప్రచండోద్యమః చంచచ్చంద్ర మరీచి నిర్మలయశః పుంజైర్జగద్రాజయన్॥ చక్రే గోపక పట్టనే స్థిరపదం.. .. తస్యాద్యప్పుదగాద్విపోద్విత రవిర్మాద్యన్మహీపద్మినీమ్॥ ఆశాపూర్తికరైః సవిజయాదిత్యః సమానందయన్॥ ......... సదనంత వీర విక్రమ కదంబకాదంబ సంపదాం ధామ్నః॥ తదనంత వీరవిక్రమ నరసింహ ఇతివిబుధాకసన్నామ్న:॥ విలోక్య పరితః సర్వాన్। చరతో ద్వీపయూధకాన్॥ తత్రైవ స్థాపయామాస। హస్తినీపట్టనం ముదా॥......సతతం సరితః పూరాద్‌బన్ధ భంగవశాత్క్రుషిః॥ పీడ్యతేదేవతా క్షోభ నిదానోఽయ ముపప్లవః॥ తన్నిరాసాయ్య తత్రయై: సర్వైః్యకృషి వలైర్ ధృవమ్॥ ప్రత్యేక స్మాత్కులాదేవో బలిః కృచ్ఛాత్సమర్ప్యతే॥ తతః సాక్షేత్రియా భూమిః నిరాబాధం స్థిరాభవత్॥ విశత్య తేషాం కృషీ భూమి భక్త్వం ముదాయుతో భూమిపతిః కదంబః॥ యావత్సుధారశు రర్కానుహం మహీందదే భూమిందువేదాదిక భూమి తేఽబ్దా॥ సామాన్యోయం ధర్మసేతు నృపాణాం కాలేకాలే పాలనీయో భవద్భిః॥ సర్వానేతాన్ భావినః పార్థివేంద్రాన్ భూయో భూయో యాచతే రామభద్రః స్వదత్తాం పరదత్తాం వా యో హరేత వసుంధరాం॥ షష్టిర్వర్ష సహస్రాణి విష్ఠాయాం యోజాతే జాయతేక్రిమిః॥

(ఈ జగత్తుని తన పరాక్రమంతో ఆనందింప చేసిన కాదంబ నరవర్మ పుట్టిన తర్వాత కాదంబ వీరులతో కలిసి శత్రువయిన అలుప రాజుని ఓడించి అతని రాజ్యాన్ని కాదంబ రాజ్యంలో చేర్చుకున్నాడు. ఎవని భుజాలలో శౌర్యశ్రీ అమరి ఉన్నదో, ఏ సూర్యుని చూపుల చేత మహీపద్మిని వికసిస్తుందో, ఎవరి యశస్సు చంద్రుని మరీచి వలె నిర్మలమయి ఈ జగత్తు అంతటా ప్రకాశిస్తున్నదో, ఆ విజయాదిత్యుడు—నరవర్మ కుమారుడు— గోపక పట్నాన్ని వశం చేసుకున్నాడు.

'అనంత వీర విక్రమ సంపద కలవాడు, కాదంబ వంశ సంపద నిధి అయిన ఈ విజయాదిత్యుడు బుధజనం చేత 'వీరవిక్రమ నరసింహ' అనే బిరుదు పొందాడు.

'ఈ ప్రదేశంలో తిరుగుతున్న ద్విప యూధాలని చూసి ఆనందించిన వాడయి హస్తినా పట్నాన్ని ఇక్కడ స్థాపించాడు...

దేవి ఆగ్రహంవల్ల ప్రతి సంవత్సరం ఈ ప్రదేశంలోని పొలం గట్లు నది వరదలకి కొట్టుకుపోయి చాలా నష్టం కలుగుతూ వుండేది దేవిని సంతుష్టపరచటానికి అక్కడి కృషీవలులంతా ప్రతి కుటుంబంలో నుంచీ ఒకరిని బలి ఇచ్చుకునేవారు. అప్పటినుంచి బాధలు తప్పిపోయాయి...

'కదంబ భూపతి నయిన నేను, విజయాదిత్యుడిని, ఈ కృషీవలుల భూమి

భక్తికి మెచ్చి ఈ భూమిని ఇక్కడే ఉంటున్న వీరికే దానం చేస్తున్నాను...

'ఎవరికయినా తను కాని మరొక రాజు కాని దానం చేసిన భూమిని హరించిన రాజు పురుగయి అశుద్ధంలో అరవయి వేల ఏళ్లు పొర్లుతాడు. ఇది తప్పని విధి. రామభద్రుడు అందుచేతనే అందరు రాజులను భావి రాజులు అనుసరించటానికి విధించిన ఈ నియమాన్ని దాటవద్దని కోరుతున్నాడు...)

శాసనం చదువుకున్న కొద్దీ బాబా సాహెబ్ ఆలోచనలో పడిపోయాడు. ముఖకవళిక గంభీరంగా మారిపోయింది. బొమలు ముడిపడ్డాయి. తటాలున కూర్చున్న చోటు నుంచి లేచి వసారాలో ఇటూఅటూ పచార్లు చెయ్యటం ప్రారంభించాడు పరస్పర విరుద్ధంగా ఉండే భావ పరంపరలు అతని తలలో ముసురుకున్నాయి.

కొన్ని నిముషాల తర్వాత శాసనాన్ని తిరిగి చదువుకున్నాడు. మళ్లీ మూడవసారి చదువుకున్నాడు. ఇంకా మరొకసారి...

పెద్ద నిట్టూర్పు విడిచాడు. అది పశ్చాత్తాపంతో కూడుకుని ఉన్న నిట్టూర్పు

'ఇది రామచంద్రప్రభువు పంపిన ఆజ్ఞ- సందేహంలేదు, స్వయాన రామచంద్రప్రభువు పంపినదే...' అనుకున్నాడు. 'నే నెంత దౌర్భాగ్యుడిని.' అయిదేళ్లుగా ఈ దైవాజ్ఞని ఉల్లంఘిస్తూ వచ్చాను, తెలియకుండానే. ఆలనాడు ఆ ప్రభువు ఈ శాసనాన్ని వేయించిన తర్వాత ఎందరు చక్రవర్తులు, రాజులు, నాయకులు... మంచివారూ, చెడ్డవారూ!—ఈ మన భరతఖండంలో ఏలారు! ఎన్నో రకాల యుద్ధాలు జరిగాయి, ఎందరో విదేశీయులు మనమీద దండెత్తారు. నెత్తురు నదులుగా పారింది. కాని, ఎవరూ కూడా రామచంద్రప్రభువు విధించిన ఈ ఆజ్ఞని ఉల్లంఘించటానికి సాహసించలేదే! ప్రజలకి ఇచ్చిన భూదానాన్ని చెడగొట్టలేదే! అంత పెద్ద చక్రవర్తులు, రాజులు సయితం నేను చేసిన ఈ పాపానికి ఒడిగట్టుకోలేదే!...

'తర తరాలుగా ఈ భూమిని తమ చెమటోడ్చి సాగుబడి చేసుకుంటున్న ఈ పేద రయితులే భూమాత అనుంగు బిడ్డలు.. మహారాజులుకూడా చెయ్యని నేరం నేను—ఒక సామాన్యుడిని, ఈ ఖాజిన్ని కేవలం మూడు తరాలుగా మాత్రమే అనుభవిస్తున్న వాడిని—గుడ్డిగా వెనుక ముందులు చూడకుండా చెయ్యటానికి పూనుకున్నానే! ఎంత అన్యాయం! ఎంత అమానుషం! తమ కాయకష్టంతో పండించుకునే ధాన్యంకూడా ఈ నిరుపేద రయితులకి లేకుండా చేస్తున్నానే! ఈ భూమి నిజానికి వారికి ఎన్ని వందల సంవత్సరాల కింద ఆ మహారాజు, ఆ కాదంబ చక్రవర్తి విజయాదిత్యుడు ఇచ్చినదే కదా ?

'తల్లీ హాత్ పాటలాయీ—నీకు వెయ్యి సార్లు మొక్కుకుంటున్నాను—నీ పాదాలకి వెయ్యిసార్లు మొక్కుకుంటున్నాను, సరయిన సమయానికి బొంబాయినుంచి ఆ స్నేహితుడిని పంపి నా కళ్లు తెరిచేట్లు చేసినందుకు! ఒక ఘోరపాపాన్ని సరిపెట్టే అవకాశం ఇచ్చినందుకు! ఇప్పటికయినా నీ హెచ్చరిక వినకపోతే నీ శాపానికి అర్హుడనే అవుతాను ...

'మద్యా!' అని అరిచాడు బాబా సాహెబ్ తన స్వగతం ఆపి, సంచీ తీసుకు వచ్చిన యువకుడితో 'పో! ఊ, వెంటనే!'

మద్యా వసారా మెట్లమీద ఒక మూలగా కూర్చుని ఉన్నాడు. యజమాని పేజ్ ఇప్పించినందుకు ఎంతో సంతోషంగా ఉన్నాడు. ఆయనే మళ్లీ ఇంత కోపంగా పొమ్మన్నందుకు నొచ్చుకున్నాడు. ఏమీ పాలుపోక లేచి నుంచున్నాడు.

'పరిగెత్తు! తొందరగా...' అన్నాడు బాబాసాహెబ్. 'ఈ ఎండలో పాపం బరువులతో నడుస్తున్న మీ వాళ్లనందరినీ ఆపు! అందరినీ పిలుచుకురా ... దేశపాండే కుటుంబంతో విరోధం ఈ నాటితో అయిపోయిందని చెప్పు! వారంలో కట్ట బాగు చేయిస్తానని చెప్పు! వచ్చే పౌర్ణమి లోపల మా ఖాజిన్—కాదు కాదు, వాళ్ల ఖాజిన్—దున్నటానికి సిద్ధంగా ఉంటుందని చెప్పు. పో! తొందరగా అందరినీ తీసుకురా!'



మద్యాకి తల తిరిగి నట్లయింది. కల గంటున్నానా, అనుకుంటూ నోరు తెరిచి తన యజమాని వయిపు చూస్తూ ఉండిపోయాడు.

'పరిగెత్తుకు పొమ్మంటే, ఇంకా ఇక్కడే ఉన్నావేమిటిరా దద్దమ్మా! దేనికోసం ఆగినట్లురా వెధవా!' బాబా సాహెబ్ సహనం పూర్తిగా కోల్పోయి మద్యా మీద అరవటం మొదలుపెట్టాడు.

బాబా సాహెబ్ గొంతుక చిన్నది కాదు. అంతేకాక 'వెధవ' అని అతను తిట్టినప్పుడల్లా యజమాని తన వాత్సల్యాన్ని ఆ విధంగా చూపిస్తున్నాడని ఊరి వారందరికీ తెలుసు. మద్యా తెప్పరిల్లాడు. ఒక్క ఉదటున బయటికి దూకి పరిగెత్తి వెళ్లిపోయాడు, వాయువేగంతో.

'యేషా, వాప్యా, సాఖ్యా, ఆ!—భీవా, శివా...రండి, వెనక్కి రండి — 'హారేయ్ మిమ్మల్నేరా! ... వోరేయ్..' సంతోషం పట్టలేక మద్యా తన అనుచరులని పిలవటం ప్రారంభించాడు.

అప్పటికే వారు కొన్ని మైళ్లదూరంలో ఉన్నారు. కనుచూపులో లేరు. వినే దూరంలోనూ లేరు. వంకర వంకరలుగా తిరిగి వెడుతున్న కట్టమీద బాట వెంబడే పరిగెత్తుకు వెళ్లిపోయాడు మద్యా.

'వినండ్రా, వినండి! మన తల్లి తల్లి హాత్‌పత్లాయీ ఈ మహిమ చూపించింది—వారే నమ్మకం లేని పిచ్చివాళ్లూ వినండి! మన తల్లే మనల్ని తరుముతుందట్రా? పిచ్చి ఎదవల్లారా — అమ్మ పిలుస్తోంది, రండిరా! శివా, భీవా ... ఆగండి...'

చెరువు కట్ట, ఏరు, కొండలు, కోనలు చెట్లు, తీగలు అన్నీ మద్యా సందేశాన్ని ప్రతిధ్వనింప చేశాయి.

'చల్లని తల్లి, మన అమ్మ!.. మనల్ని ఇంటికి రమ్మంటోందిరా! అంతా ఆ యమ్మ మహిమరా...' అనే పాటని గొంతెత్తి పాడాయి.